నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శనివారం | జూన్ 29, 2024 | www.navatelangana.com

విఠలేశ్వర ఆలయంలో దొంగతనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని రాంనగర్ విఠలేశ్వర మందిరంలో గురువారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారు. ఆలయంలోని హుండీ పగులగొట్టి అందులోని నగదు, నగలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం సమాచారం అందుకున్న వేలిముద్రల నిపుణులు ఆలయంలో ఆధారాలు సేకరించినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. పోలీస్ కాలనీలోని హనుమాన్ దేవాలయంలోకి చొరబడిన దుండగులు హుండీ పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. తాజాగా పట్టణంలోని రాంనగర్ విఠలేశ్వర మందిరంలో ఇలాంటి ఘటనే జరగడం చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

హస్తం గూటికి మరో ఇద్దరు కౌన్సిలర్లు

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. ఇటీవల బీఆర్ఎస్ నుండి పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా తాజాగా మరో ఇద్దరు బీఆర్ఎస్‌ను వీడారు. దీంతో పట్టణంలో బీఆర్ఎస్ ఖాళీ అవుతోంది. తాజాగా 30వ వార్డు కైలాసనగర్ కౌన్సిలర్ అర్చన-రామ్‌కుమార్, 10వ వార్డు కౌన్సిలర్ రాంనగర్‌కు చెందిన సుజాత-భూమన్న హైదరాబాద్‌లో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తుమల్లేష్, సీనియర్ నాయకులు వేణుగోపాలచారి, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, డేరా కృష్ణారెడ్డి, నరేష్, అఖిల్ పాల్గొన్నారు.



ఇక మహిళా శక్తి క్యాంటీన్లు..!

- తొలిదశలో జిల్లాకు నాలుగు చొప్పున ఏర్పాటు
- స్వయం సహాయక సంఘాలతో నిర్వహణ
- బ్యాంకు రుణాలు ఇప్పించి ఆర్థిక తోడ్పాటు
- తక్కువ ధర..నాణ్యమైన భోజనం లభించేలా నిర్వహణ
- త్వరలోనే ఏర్పాటుకు అధికారుల సన్నాహాలు

ఉమ్మడి జిల్లాలో ఇక మహిళా శక్తి క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నాయి. తొలి దశలో జిల్లాకు నాలుగు చొప్పున ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అధికారులు క్యాంటీన్ల ఏర్పాటుకు సన్నాహాలు మొదలుపెట్టారు. స్వయం సహాయ సంఘాలకు ఆర్థిక తోడ్పాటునందించి వీటిని ప్రారంభించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ క్యాంటీన్ల ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక అండతో పాటు పేదలకు తక్కువ ధరకు..నాణ్యమైన భోజనం లభించేలా వీటిని తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే రెండింటిని ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేపట్టగా..మిగితా వాటిని కూడా ఏర్పాటుచేసేందుకు అనువైన స్థలాలను అన్వేషిస్తున్నారు. ఇప్పటికే బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించిన అధికారులు త్వరలోనే వీటిని కార్యరూపంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో 16 మహిళా శక్తి క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నాయి.




నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి క్యాంటీన్లకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే వివిధ రకాల సంక్షేమ పథకాలు సైతం అతివల పేరిటే అమలు చేస్తున్న ప్రభుత్వం వారిని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా జిల్లాల్లో మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటుచేయాలని సంకల్పించింది. ఇందుకు సంబంధించి విధివిధానాలను ఖరారు చేసింది. ఇది వరకే కేరళ, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఈ క్యాంటీన్లు అమలవుతుండటంతో మన రాష్ట్రంలోనూ తరహా వాటిని ఏర్పాటు చేయాలని సూచనలు చేసింది. ఫలితంగా అధికారులు వీటికి సంబంధించి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించారు. బ్యాంకర్లతో సమీక్షించిన ఉన్నతాధికారులు ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇప్పించేలా ఆదేశాలు జారీ చేశారు. తొలి దశలో జిల్లాకు నాలుగు చొప్పున ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు బోథ్ ఎక్స్‌రోడ్‌లోని పొచ్చర వద్ద స్థలాలను అధికారులు పరిశీలించారు.

బ్యాంకు రుణాలు ఇప్పించి తోడ్పాటు

ఆదిలాబాద్ జిల్లాలో ఈ క్యాంటీన్ల ఏర్పాటుకు ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల నుంచి లింకేజీ రుణాలను ఇప్పించనున్నారు. ఒక్కో గ్రూపులో కనీసం 10మంది సభ్యులు ఉండటంతో పాటు వంటలు చేయడంలో అనుభవం, క్యాటరిన్ నిర్వహణ తదితర వాటిని పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేశారు. వీరికి హైదరాబాదులోని నీతం ఇన్స్టిట్యూట్‌లో పది రోజుల పాటు శిక్షణ ఇప్పిస్తారు. క్యాంటీన్ల నిర్వహణలో వివిధ రకాల మెళుకువలు నేర్పించనున్నారు. ఈ క్యాంటీన్లలో ఉదయం పూట టిఫిన్, మధ్యాహ్నం లంచ్‌తో పాటు రాత్రి భోజనం అందుబాటులో ఉంచనున్నారు. ఈ క్యాంటీన్లలో బయటి ప్రాంతాల్లో ఉండే వాటి కంటే ఇక్కడ తక్కువ ధరతో పాటు నాణ్యమైన భోజనం లభించేలా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్యాంటీన్ల ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక తోడ్పాటు, ఉపాధి కల్పించడంతో పాటు ప్రజలకు నాణ్యమైన భోజనం లభించేలా వీటిని ఏర్పాటుచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోపక్క ఈ క్యాంటీన్లతో పాటు రానున్న రోజుల్లో మైక్రో ఎంటర్‌ప్రైజేస్‌ల ఏర్పాటుకు సైతం తోడ్పాటునందించనున్నారు. వారికి ఉన్న అభిరుచిని బట్టి వివిధ రకాల చిర వ్యాపారాలకు తోడ్పాటునందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

త్వరలోనే ఏర్పాటు చేస్తాం : బిట్ల గంగన్న, డీపీఎం, డీఆర్‌డీఏ



ఉన్నతాధికారుల ఆదేశం మేరకు జిల్లాలో నాలుగు చోట్ల మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటుచేస్తున్నాం. ఇప్పటికే రెండు చోట్ల అనువైన స్థలాలను పరిశీలించాం. మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించడంతో పాటు క్యాంటీన్ల నిర్వహణలో మెళుకువలు నేర్పించేందుకు శిక్షణ ఇప్పిస్తాం. మిగితా వాటిని కూడా ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటాం.

స్వాగత తోరణం ప్రారంభించిన మాజీ విజయ డెయిరీ చైర్మన్



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రుయ్యాడి గ్రామంలో కొత్తగా నిర్మించిన స్వాగత తోరణాన్ని మాజీ విజయ డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ రూ.17లక్షల సొంత డబ్బులతో స్వాగత తోరణాన్ని నిర్మించారని తెలిపారు. దీనికి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. రుయ్యాడి గ్రామం పట్ల గంగాధర్ అభిమానం ఎల్లవేళలా ఇలాగే ఉండాలన్నార. గంగాధర్ మాట్లాడుతూ రుయ్యాడి గ్రామానికి తన మద్దతు ఎల్లవేళలా ఉంటుందని, హసేన్ హుస్సేన్ దేవస్థానం అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు బిట్ల గంగన్న, ప్రకాష్‌రెడ్డి, గంగాధర్, శ్రీనివాస్, వెంకటరెడ్డి, పోతారెడ్డి, రామకృష్ణ, నర్సింగ్, అశోక్, చారి, గణపతి, సుభాష్, సంజీవరెడ్డి, రాకేష్ పాల్గొన్నారు.

ఘనంగా పీవీ నరసింహారావు జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో బోలి చేతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత ప్రధాని పీవీ నరసింహారావు జయంతి నిర్వహించారు. శుక్రవారం బోలి చేతో ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు 'పీవీ నరసింహారావు స్ఫూర్తితో ముందుకు సాగుద్దాం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మెస్రం గంగారాం, ఉపాధ్యాయులు జాదవ్ సురేష్, రాథోడ్ ప్రకాష్, గోడం శ్రీనివాస్, బోలి చేతో ఫౌండేషన్ ప్రతినిధులు ఆత్రం మోతీరామ్, సిడాం వర ప్రసాద్, సిడాం కిరణ్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు జాబ్‌మేళా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో శుక్రవారం నిరుద్యోగ యువకులకు జాబ్ మేళా నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎంఎస్ఎన్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్ ఉద్యోగాల కోసం జిల్లా నలుమూలల నుంచి యువకులు తరలి వచ్చారు. ఎంపికైన వారికి ఏడాది పాటు ఉచిత భోజనం, వసతితో పాటు శిక్షణ కాలం వేతనం అందిస్తామని ఆ కంపెనీ సీనియర్ మేనేజర్ చాణక్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కార్యాలయం సిబ్బంది గోవర్ధన్, జయశ్రీ, శంకర్, కంపెనీ సభ్యుడు శంకర్, ఆదిలాబాద్ ఎస్‌బిఐ బ్యాంకు టెరిటరీ మేనేజర్ సదానంద్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.అచ్చి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీష్, ఉర్దూ, జువాలజీలలో ఒక్కోటి చొప్పున కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ సబ్జెక్టులో రెండు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.జలగం అనిత పేర్కొన్నారు. ఇంగ్లీషు, ఉర్దూ, ఎకనామిక్స్, హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్ లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

ఇచ్చోడ కళాశాలలో..

ఇచ్చోడలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.అచ్చి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇంగ్లీష్, తెలుగు, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, బాటనీ, జువాలజీలలో ఒక్కోటి చొప్పున కామర్స్ సబ్జెక్టులో రెండు చొప్పున ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీ సంబంధిత సబ్జెక్టులో కనీసం 55శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉన్నా అర్హులేనన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డి కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రం అందజేస్తే వెయిటేజీ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో జులై 2న ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో దరఖాస్తులు అందజేసి 3న అదే కళాశాలలో జరిగే డెమోకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఆయా కళాశాలలో సంప్రదించాలని వారు సూచించారు.

పెండింగ్ నిధులు ఇవ్వకుంటే బడులకు తాళాలే

మండల సమావేశంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో మనఊరు మనబడికి సంబంధించి పెండింగ్ నిధులు ఇవ్వకుంటే పనులు చేసిన పాఠశాలలకు తాళాలు వేయాల్సి ఉంటుందని ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించిన చిట్టచివరి మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పిటిసి నాగేశ్వరరావు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ, వైద్య, నీటిపారుదల, విద్య, ఐసిడిఎస్, వెటర్నరీ, ఈజీఎస్, ఐకెపి శాఖల మండల స్థాయి అధికారులు తమ అభివృద్ధి నివేదికలను ప్రవేశపెట్టారు. విద్యాశాఖ నివేదిక సందర్భంలో మన ఊరు మనబడి పెండింగ్ నిధుల గురించి చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ఊరు మనబడి నిధులు పెండింగ్ ఉండగా ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పనులు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ నిధులు ఇవ్వకుంటే కాంట్రాక్టర్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పెండింగ్ నిధులు మంజూరు చేయకుంటే పాఠశాలలకు తాళాలు వేయాల్సి రావడంతో పాటు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా అభివృద్ధి నిధులు మంజూరు చేయాల్సి ఉంటుందని సూచించారు. ఇదే సందర్భంలో జిల్లా విద్యాధికారి అశోక్‌తో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ నిధులకు సంబంధించిన నివేదిక పంపించి డిఎంఎఫ్‌టి నిధుల నుండి చెల్లించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జడ్పిటిసి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పరిపాలనలో సాధ్యమైనంత అభివృద్ధి చేశామని తెలిపారు. అయితే అధికారులు ప్రజాప్రతినిధులను ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ మాట్లాడుతూ స్థానిక సంస్థల అభివృద్ధి పది సంవత్సరాల్లో ఎనలేనంతగా జరిగిందన్నారు. అనంతరం చివరి సమావేశం కావడంతో మండల పరిషత్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీటీసీలు, మండల స్థాయి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సీసీఐని పున:ప్రారంభించాలి

- కేంద్రమంత్రికి రాష్ట్రమంత్రితో కలిసి వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

30ఏళ్ల నుంచి ఆదిలాబాద్ జిల్లాలో మూతబడి ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఆదిలాబాద్ ఎంపీ, ఎమ్మెల్యే గోడం నగేష్, పాయల్ శంకర్ అన్నారు. ఈ విషయమై శుక్రవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామితో భేటీ అయ్యారు. గతంలో మూతపడ్డ సిమెంట్ ఫ్యాక్టరీ పున:ప్రారంభిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 5వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. అంతే కాకుండా ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీమ్-ఆసిఫాబాద్ జిల్లాలో సిమెంట్ ముడి ఖనిజం లైమ్ స్టోన్ నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయని కేంద్ర మంత్రికి వివరించారు. పీపీపీ పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వం ఈ సిమెంట్ ఫ్యాక్టరీని చేపట్టడానికి సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రికి తెలిపారు. రాష్ట్ర ప్రతినిధుల వినతిపై కేంద్ర మంత్రి కుమారస్వామి అనుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

డోర్లి వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి



నవతెలంగాణ-రెబ్బెన

డోర్లి గ్రామం సమీపంలో ఉన్న వాగుపై నూతనంగా హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టికానందర్ అన్నారు. 'సమస్యలు చెప్పండి..పోరాటం చేద్దాం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తిర్యాణి మండలంలోని ఉల్లిపిట్ట, డోర్లి, జెండగూడ గ్రామాలను డివైఎఫ్ఐ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు టికానంద్ మాట్లాడుతూ వర్షాకాలంలో డోర్లి వాగు దాటి రావడానినికి మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పై చదువుల కోసం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చే విద్యార్థులు సైతం లోహెవల్ వంతెనతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. లింగాపూర్ ప్రజల కూడా ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తారని, ఇలా మూడు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు ఈ బ్రిడ్జి గురించి చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. డోర్లి-1 సింగరేణి ప్రాజెక్టు డంపింగ్ యార్డ్ మట్టి వచ్చి బ్రిడ్జి కింద పూర్తిగా నిండిపోయిందన్నారు. దీంతో వర్షం పడితే బ్రిడ్జి పైనుండి నీళ్లు పారుతున్నాయని తెలిపారు. సింగరేణి అధికారుల నిర్లక్ష్యం వల్లే రహదారికి ఇబ్బందిగా మారిందన్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సంబంధిత గ్రామాలను కలుపుకొని గోలేటి జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ తిర్యాణి మండల ఉపాధ్యక్షులు బాపురావ్, రాజేష్, ఉల్లిపిట్ట, డోర్లి గ్రామస్తులు సాంబయ్య, మధు, కిరణ్, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీల కూలిరేట్ల పెంపుకు పోరాటం



నవతెలంగాణ-నిర్మల్

వ్యవసాయ కూలీల కూలిరేట్ల పెంపుదల కోసం పోరాడుదామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. 2013 తర్వాత వ్యవసాయ కార్మికుల కూలీరేట్లను పెంచలేదన్నారు. వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, కనీస వేతనం రోజు కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో వ్యవసాయ కూలీలతో సమావేశాలు నిర్వహించి కూలిరేట్ల పెంపుదల కొరకు పోరాటాల నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు బార్కుంట గంగారాం, చందుల సాయికిరణ్, జాదవ్ రమేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య పాల్గొన్నారు.



ముందుజాగ్రత్తగా రోడ్డుకు మరమ్మతులు

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లింగోజీతండా గ్రామపంచాయతీలో వర్షాకాలాన్ని దృష్టిట పెట్టుకొని ముందు జాగ్రత్తగా రోడ్డుకు, మురుగు కాల్వలకు మరమ్మతులు చేస్తున్నామని మాజీ సర్పంచ్ జాదవ్ హరి నాయక్, ఇన్‌చార్జి కార్యదర్శి ఆడే విక్రమ్ అన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందుస్తుగా ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్న గ్రామపంచాయతీలో తెలియజేయాలని సూచించారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29న శనివారం నిర్వహించనున్నట్లు కమిషనర్ మహమ్మద్ ఖమర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

విధుల పట్ల అలసత్వం తగదు

● సీఐ శ్రీనివాస్

నవతెలంగాణ-సారంగాపూర్



పోలీసులు విధుల పట్ల అలసత్వం తగదని నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ జులై 1వ తేదీ నుంచి నూతన చట్టాలు అమల్లోకి రానున్నాయని అన్నారు. అందరు అవగాహన కలిగిఉండాలని మాదకద్రవ్యాల నిర్మూలన కోసం అందరూ కృషి చేయాలని సూచించారు. పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మైనార్టీ విద్యార్థికి రూ.50వేల పురస్కారం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ గత ప్రభుత్వంలో స్థాపించిన గురుకులాలు నేడు విద్యార్థుల భవిష్యత్తుకు గట్టి పునాదులను వేస్తోందని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణానికి చెందిన హమీయ ఫిరాస్, బంగారిగూడలోని మైనార్టీ గురుకులంలో చదువుతూ 545వ ర్యాంకును సాధించడం గర్వకారణమని అన్నారు. యూనిస్ అక్బాని, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ విద్యార్థినీ ప్రతిభ పట్ల అభినందనలు తెలియజేస్తూ, శాలువా కప్పి ఘనంగా సన్మానించి, రూ.50వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సాజిదోద్దీన్, ప్రిన్సిపాల్, సిబ్బంది, బంగారుగూడ కాలనీవాసులు నాయకులు పాల్గొన్నారు.

దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు ఘన నివాళులు



నిర్మల్

నవతెలంగాణ-నిర్మల్

బహుముఖ ప్రజ్ఞాశాలి, అపర మేధావి, భారత మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ కౌన్సిల్ సభ్యులతో కలిసి, శుక్రవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్ చౌరస్తాలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి సంపన్న భారత దేశం రూపొందడానికి బాటలు నిర్మించిన అసాధారణ నేత, బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొండ సబిత శ్రీధర్, రామగోని తులసి నర్సాగౌడ్, అన్వర్‌పాషా, కోఆప్షన్ సభ్యులు చిలుక గోవర్ధన్ ఉన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

కాంగ్రెస్ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షులు కూచడి శ్రీహరావు పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. భారత ప్రధాని తెలుగు జాతికి గర్వ కారణమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి రాజేశ్వర్, నిర్మల్ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, మున్సిపల్ కౌన్సిలర్‌లు గండ్రత్ రమణ, ప్రభాస్ లేబర్ యూనియన్ అధ్యక్షులు పరికిపండ్ల స్వదేశ్, యువజన కాంగ్రెస్ నాయకులు పుదారి అరవింద్, గాజుల రవికుమార్, గణేష్, అడపా శ్రీకాంత్, గడ్డింటి ప్రశాంత్, సారంగాపూర్ మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాకిపెల్లి సురేందర్, కాంగ్రెస్ నిర్మల్, సోన్, సారంగాపూర్ మండలాల నాయకులు మధుకర్‌రెడ్డి, వేణు, బొల్లోజు నర్సయ్య, మండలాల కాంగ్రెస్ నాయకులు రాజ్ మహమ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : భారత దేశంలో ఆధునిక ఆర్థిక వ్యవస్థను రూపొందించేలా అనేక ప్రణాళికలను రూపొందించిన మహానుభావుడు ఆయన జీవితం ప్రతీ కాంగ్రెస్ వాదికి ఆదర్శమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. స్వర్గీయ పీవీ నర్సింహారావు దేశ ప్రధానిగా దేశానికి చేసిన సేవలు భారత జాతి ఎన్నటికీ మరువదని అన్నారు. శుక్రవారం పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకుని తన నివాసంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని ఏలిన తొలి తెలుగు తేజం, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ అని గుర్తుచేశారు. బహుభాషా కోవిదుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, దేశ అభ్యున్నతికి కొత్త బాటలు వేసిన ఆర్థికవేత్త పీవీ అని అన్నారు. దేశంలో భూసంస్కరణల చట్టం చేసి ప్రధానిగా పూర్తికాలం దేశానికి సుస్థిర పాలన అందించారని అన్నారు. తెలుగు రాష్ట్ర అభ్యర్థిని ప్రధానిగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నలిమెల నవీన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు, కుదురు పక్క సురేష్, నాగరాజు, రంజిత్, శ్రీనివాస్, వెంకటేష్, అడెల్లు, దినేష్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్

డ్రైడేను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్

నవతెలంగాణ-నిర్మల్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆస్రా కాలనీ, శాంతినగర్‌లో విస్తృతంగా పర్యటించి, డ్రైడే కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిన ప్రదేశాలలో ఆమె ఆయిల్ బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలను పకడ్బందీగా అమలు చేయాలనీ ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రతి మంగళ, శుక్రవారాలలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. రహదారులు, ఇంటి పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా వెంటనే తొలగించేలా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటిపరిసరాలలో కూలర్లు, నీటి తొట్టెలు, టైర్స్ వంటి వాటిలో నీరు నిలువకుండా శుభ్రం చేసుకోవాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత, అంటూ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని పంచాయతీ, వైద్య, మున్సిపల్ శాఖల అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వర్, డీఎంహెచ్‌ఓ డా.ధనరాజ్, డీఎంసీ సుభాష్, మున్సిపల్ డీఈ సంతోష్, వైద్యులు రాజేందర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి రవీందర్, స్థానిక కౌన్సిలర్లు, వైద్య మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరం : ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ సోలమన్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పాత కుండలు, టైర్లలో నిల్వ ఉన్న నీటిని సిబ్బందితో పారబోయించారు. ఇంటి పరిసరాల్లో మురుగు గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా రాజుర గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి : ఇంటి పరిసరాల్లో నీటి విలువ లేకుండా చూసుకోవాలని మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో పాటు ఎంపీడీఓతో కలిసి ఫ్రైడే డ్రైడే సందర్భంగా గ్రామంలోని పరిసరాలను పరిశీలించి, నీటి నిల్వలను తొలగించి, ప్రజలకు పలు సూచనలు చేశారు. భీంపూర్ మండల పరిధిలోని గ్రామాలలో ఫ్రైడే-డ్రైడే జాతీయ కీటక జనిత ఆరోగ్య అవగాహన కార్యక్రమం ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రత్యేక జాగ్రత్తలు క్లోరినేషన్ చేసిన నీటిని, గాని కాచి చల్లార్చిన నీటిని తాగడానికి వినియోగం చేయాలని, వేడి, వేడి ఆహారపదార్థాలను భుజించాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని అన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే ఆశా కార్యకర్తలను, ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించి, పరీక్షలు చేయించుకోని వైద్యాధికారి సూచనలతో మందులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో చెట్ల కుండీల్లో టైర్లలో నీటి నిలువ లేకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాంసి ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, కార్యదర్శి గంగన్న, భీంపూర్ డాక్టర్ నిఖిల్‌రాజ్, ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు బి.గంగాధర్, తులసి రామ్, ఎంఎల్‌హెచ్‌పీ జె.మాయావతి, ఆరోగ్య కార్యకర్త గోదావరి, సంబంధిత గ్రామాల ఆశా కార్యకర్తలు పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.



తాంసి

ఆర్‌ఎంపీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్‌ఎంపీ డాక్టర్‌ల అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓ డా.నరేందర్ రాథోడ్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఆర్‌ఎంపీ డాక్టర్‌ల పట్ల జరుగుతున్న టీఎంసీ వాళ్లదాడుల గురించి వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఓ మాట్లాడుతూ కలెక్టర్ తీసుకున్న రివ్యూ మీటింగ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన ఆర్‌ఎంపీలపైన కేసులు నమోదుచేసి జైల్లో పెట్టమని ఆదేశాలు జారీ చేస్తున్నారని తెలిపారు. కాని తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. నిబంధనలకు లోబడి మాత్రమే ప్రాక్టీస్ చేయాలని సూచించారు. అలా చేస్తే తమపైన ఎలాంటి చర్యలు ఉండవని తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పనిసరిగా ఉంటాయని ఇన్నాళ్లు చూసి చూడనట్లుగా వ్యవహరించామని ఇకనుండి అలా ఉండదని స్పష్టం చేశారు. స్టెరాయిడ్స్ పెయిన్ కిల్లర్స్ ఇతరత్రా అనేక రకాలుగా రోగుల ఇస్తున్నారని అది మంచి పద్ధతి కాదని రోగులు తీవ్రంగా అనారోగ్యం పాలై నష్టపోతున్నారని అన్నారు. మీరు ఇచ్చే పెయిన్ కిల్లర్స్ వల్ల కిడ్నీలు చెడిపోతున్నాయని అన్నారు. జాగ్రత్తగా ప్రాక్టీస్ చేసుకోవాలని తెలిపారు. త్వరలోనే జిల్లాలోని సమస్త ఆర్‌ఎంపి వైద్యులందరిని ఒక చోటికి పిలిపించి అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామోజీ వీరాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లబండి శంకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కావటి రమేష్, ఉపాధ్యక్షుడు మోహన్, బోథ్ మండల్ అధ్యక్షులు విశ్వనాథ్, తాంసి పవర్, తలమడుగు, అశోక్, బీంపూర్, ఉమేష్ యాదవ్, రమణ యాదవ్, సంజీవ్ ఉన్నారు.

అవినీతి అధికారికి సహకరిస్తే సహించేది లేదు

● చర్యలు చేపట్టకపోతే రాష్ట్ర కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం



నవతెలంగాణ-ఖానాపూర్

అవినీతి అధికారికి సహకరిస్తే సహించేది లేదని ఆయా ప్రజాసంఘాల నాయకులు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా అధ్యక్షులు నందిరామయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని విశ్రాంతిభవనంలో ప్రజాసంఘాల నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీడీపీఓ డబ్బులు వసూలు చేస్తున్నారని, ముందుకు వచ్చిన బాధితురాలు ఆధారాలు ఇస్తే అధికారులు ఎందుకు స్పందించడం లేదని అన్నారు. ఈ ముడుపుల వ్యవహారం జిల్లా స్థాయిలోనేనా రాష్ట్రస్థాయికి అందుతున్నాయా అని అనుమానం వ్యక్తం చేశారు. సీడీపీఓ అక్రమాలకు పాల్పడినట్లు అన్ని ఆధారాలు సమర్పించిన చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని అన్నారు. 22 రోజుల క్రితమే కమిషనర్ కార్యాలయంలో ఆధారాలు ఇచ్చినప్పటికీ చర్యలు ఎందుకు తీసుకుంట లేరని ప్రశ్నించారు. సీడీపీఓను తప్పించకుండా విచారణ చేపడితే, చిరు ఉద్యోగులైన అంగన్‌వాడీలు ఎలా ఆమె అవినీతిని చెబుతారని అన్నారు. డబ్బులు ఫోన్ పే పంపినట్టు ఆధారాలు సమర్పిస్తే, ఇచ్చిన ఆధారాలపై విచారణ చేయకుండా అందరిని గంపగుత్తగా విచారణ చేస్తే నిజం ఎలా బయటికి వస్తుందని అన్నారు. తూతూ మంత్రపు విచారణలు మానుకొని, సీడీపీఓను వెంటనే విధుల నుంచి తప్పించాలని ఉన్నతాధికారులతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. చర్యలు చేపట్టకపోతే హైదరాబాద్‌లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయాన్ని బాధితులతో కలిసి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్, గంగామణి, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు విజయ, ఖానాపూర్ సెక్టర్ అధ్యక్షులు మునెంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, ఆదివాసీ గిరిజన సంఘం తొడసం శంభు, అంగన్‌వాడీ టీచర్ రాణి, రాజన్న ఉన్నారు.

ఇంటికెళ్లాలంటే నీరు దాటాల్సిందే..!

నవతెలంగాణ-బేల

మండలంలోని కాప్సీ గ్రామంలోని ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డు పరిస్థితి ఇది. నడి రోడ్డు పైనే మోకాళ్ల లోతు నిలిచిన నీరు. పట్టించు కోని పంచాయతీ అధికారులు. ఒక వైపు ప్రభుత్వం వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, అంటు వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. కానీ ఇక్కడ పంచాయతీ అధికారులకు ఎస్టీ కాలనీవాసులు పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల వారం రోజుల కింద కురిసిన వర్షాలకు రోడ్డు మీద నీరు భారీగా నిల్వ ఉందని, ఈ నిల్వ నీటి వల్ల దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, రాత్రి సమయంలో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే పాములు, తేళ్ల భయం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నత అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

నవతెలంగాణ-కుభీర్

ముధోల్ నియోజకవర్గంలోని దేవాలయాలను అబివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని, ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం కుభీర్ మండలంలోని చోండి గ్రామంలో నూతనంగా నిర్మించిన, శివదత్త సాయి మందిర్ విగ్రహ ప్రతిష్టపన కార్యక్రమానికి ముఖ్యఅతితిగా హాజరై దత్త సాయి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామ మహిళలు మంగళహారతులతో ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తానని అన్నారు. అదే విధంగా గ్రామంలో ఉన్న సమస్యలను దశల వారిగా అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బోయిడి విఠల్, మోహన్, మాజీ సర్పంచ్ చంద్రకాంత్, కనకయ్య, నగేష్, రాందాస్, ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు, గ్రామ యువకులు, గ్రామస్తులు ఉన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

నవతెలంగాణ-నార్నూర్

అమ్మఆదర్శ పాఠశాల పనుల్లో నాణ్యత పాటించే విధంగా చూడాలని జెడ్పీ సీఈఓ రత్నమాల సూచించారు. శుక్రవారం మండలంలోని తాడిహత్నూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. జరిగిన పనులపై ఆరా తీసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాంట్రాక్టర్‌ను అడిగితెలుసుకున్నారు. గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వారి వెంట ఎంపీడీఓ జవహర్ లాల్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ గంగాసింగ్, ప్రధానోపాధ్యాయులు మనోహర్, కార్యదర్శి శేఖర్, కాంట్రాక్టర్ జైపాల్ ఉన్నారు.

భైంసా నుంచి పల్సి మీదుగా కిని వరకు బస్సు ప్రారంభం

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడటంతో పల్సి గ్రామస్తులు కలిసి భైంసా డిపో మేనేజర్‌కు విన్నవించారు. శుక్రవారం భైంసా నుంచి పల్సి మీదుగా మహారాష్ట్రలోని కిని వరకు బస్సు ప్రారంబించామని అన్నారు. ఈ సందర్భంగా పల్సి గ్రామ కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు విలాస్ బస్సుకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఉచిత బస్సు, సౌకర్యం కల్పించి, మహిళలకు ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. దీంతో పాటు ప్రతి ఇంటికి 200 యూనిట్స్ విద్యుత్, రూ.500 గ్యాస్ సిలెండర్‌తో పాటు రైతులకు రైతు భరోసా కల్పించారు. ముఖ్యంగా రానున్న ఆగస్టు నెలలో ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని అన్నారు. బస్సులో ఎలాంటి ఇబ్బందులు కల్గించుకోకుండా ఒక్కరికి ఒక్కరు సహకరించుకునేలా చూడాలని తెలిపారు. అంతకు ముందు బస్సు కండక్టర్, డ్రైవర్‌కు గ్రామస్తుల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు ఉన్నారు.

రూ.3లక్షల61వేలకు వారసంత వేలం

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో వారసంతకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో పట్టెపు పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం వారసంత వేలం పాట నిర్వహించారు. ఎంపీడీఓ రాజ్‌వీర్, ఎంపీఓ లక్ష్మణ్ ఆధ్వర్యంలో వారసంత వేలం పాట ప్రభుత్వం తరఫున రూ.3లక్షల 60 వేలతో ప్రారంభించగా, వేలంపాట పాడటానికి వచ్చిన గ్రామస్తులు వ్యతిరేకించారు. ప్రభుత్వం తరఫున మూడు లక్షల అరవై వేల రూపాయలు రాయడం సరికాదని అందులో మాకు ఎటువంటి గిట్టుబాటు జరగడం లేదని తెలిపారు. వారసంతలో సరైన సదుపాయాలు లేక వారసంతకు వచ్చిన దుకాణదారులు తాగడానికి నీరులేదని, సరైన మూత్రశాలలు లేవని, వారసంతలో ఆవుల బెడద ఎక్కువగా ఉందని, అంతేకాకుండా ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు గాని ఇతర వాహనాలు గాని పార్కింగ్ చేసుకోవడానికి స్థలం లేకపోవడం ఇలా ఎన్నో ఇబ్బందులు ఉన్నాయని పట్టేపు ప్రకాష్ తెలిపారు, ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, అంతేకాకుండా మేము తీర్చగల సమస్యలను తీరుస్తామని మావల్ల కానీ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, ఎంపీడీఓ సానుకూలంగా తెలిపారు రూ.3 లక్షల 61 వేలకు పట్టేపు ప్రకాష్ వేలం పాటలో వారసంతను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో తొగరి రవి, బక్రే లక్ష్మణ్, గాజుల రాజన్న, తొగరి సుమన్, శతల్ల భోజన్న, రాజేశ్వర్, రాము పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం బీజేపీ నాయకులు స్థానిక బాలికల పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత శ్యామప్రసాద్ ఆశయాలను కొనసాగిస్తూ, ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాయిని సంతోష్, సత్యవతి, కొండవేని రమేష్, గోపాల్‌రెడ్డి, పరమేశ్వర్, శేఖర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

గోదారమ్మకు భక్తుల ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని గడ్‌చాంద గ్రామ శివారులోని గోదావరి రేవు వద్ద శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గోదారమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం గడ్డితో తయారు చేసిన తెప్పలలో పిండి వంటలు చేసి తెప్పలో ఉంచి, గోదారమ్మకు సమర్పించారు. సమయానికి వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని మొక్కుకున్నట్టు తెలిపారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత కుటుంబాలన్ని గంగమ్మకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు.

వర్షాలు కురవాలని గ్రామదేవతలకు జలాభిషేకం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజూర గ్రామంలో శుక్రవారం వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు పండాలని గ్రామస్తులు పూజలు నిర్వహించారు. గడ్‌చాంద గోదావరి నుంచి గంగ జలాన్ని తీసుకొచ్చి బాజా భజంత్రీలు, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | జూన్ 29, 2024 | www.navatelangana.com

ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మాజీ ప్రధాని పీవీ నరసింహరావు జయంతిని శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీనియర్ సిటిజన్ కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ముందుగా పీవీ నరసింహరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో నూతన ఆర్థికవిధానాలకు రూపకల్పన చేసిన ఆర్థిక వేత్త పీవీ అని అన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన దార్శనికుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు ఎస్ఆర్ మూర్తి, పురుషోత్తం, యు నారాయణ, ఎల్లాగౌడ్, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, ఫారూఖ్, రమణయ్య పాల్గొన్నారు.

ఏహెచ్ఎస్ విద్యార్థుల విహార యాత్ర

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్త ఆదేశాల మేరకు సాలార్జంగ్ మ్యూజియం పర్యటనకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ మ్యూజియం పర్యటనకు మొత్తం 50 మంది విద్యార్థులను తీసుకు వెళ్లినట్లు తెలిపారు. పురాతన వస్తువులపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఆలోచన నేపథ్యంలో విద్యార్థులను తీసుకువెళ్తున్నట్లు వివరించారు. విద్యార్థుల్లో సాంస్కృతిక చారిత్రాత్మక జ్ఞానాన్ని పెంపొందించే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి



నవతెలంగాణ-నార్నూర్

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలని గాదిగూడ పీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్ కుమార్, సంజీవ్ కుమార్ అన్నారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ, ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. తీసుకునే జాగ్రత్తలపై వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో ముందస్తుగా డ్రైడే సందర్భంగా పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో హెచ్ఈఓ రవీందర్, ఐకేపీ ఏపీఓ మాదవి, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నవీన్ అన్నారు. జిల్లా విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలని, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల్లో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేసి విద్యా సంస్థల్లో 25శాతం పేదలకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్న వర్మ ఆసిఫాబాద్ నగర కార్యదర్శి కొడప హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యుద్ఘాతానికి గురై గేదె మృత్యువాత



నవతెలంగాణ-ఖానాపూర్

విద్యుద్ఘాతానికి గురై గేదె మృత్యువాత పడ్డ సంఘటన ఖానాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు నందుర్క ఇందయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ శివారులోని తర్లపాడు రోడ్డులో గల ఇండియన్ గ్యాస్ గోదాంకు ఎదురుగా పొలంలో కరెంటు పోల్‌వద్ద విద్యుద్ఘాతానికి గురైంది. ఈ ప్రమాదం రూ.లక్ష విలువగల గేదె మృతి చెందిందని రైతు బోరున విలపించారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారి పొన్నం చందర్, వెటర్నరీ శాఖ అధికారి బైసన్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. రైతుకు తగిన న్యాయం జరిగే విధంగా చూస్తామని వారు హామీ ఇచ్చారు.

పదో తరగతి ప్రతిభా పురస్కార గ్రహీతల జాబిత విడుదల

నవతెలంగాణ-ఖానాపూర్

పదోవతరగతి 2024 వార్షిక పరీక్షలో అత్యధిక జీపీఏ సాధించిన ఖానాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను త్వరలో అందజేయనున్నట్టు శుక్రవారం నిర్మల్ జిల్లా ప్రథమ రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భరద్వాజ్ జీపీఏ 9.8, జెడ్పీఎస్ఎస్ మాస్కాపూర్, ఎ.స్వాతి జీపీఏ 9.8, జెడ్పీఎస్ఎస్ బాలికలు ఖానాపూర్, బి.వర్షిత జీపీఏ 9.5, జెడ్పీఎస్ఎస్ సత్తనపల్లి, ఎం. వందన జీపీఏ 9.3, జెడ్పీఎస్ఎస్ బీర్నంది, సుఫియా హస్నా జీపీఏ 9.2, జెడ్పీఎస్ఎస్ ఖానాపూర్, ఎ.వరలక్ష్మి జీపీఏ 8.8, జెడ్పీఎస్ఎస్ పాత ఎల్లాపూర్, ఒ.రాహుల్ జీపీఏ 8.8, జెడ్పీఎస్ఎస్ సుర్జాపూర్, జి.రక్షిత జీపీఏ 8.0, జెడ్పీఎస్ఎస్ (హెచ్‌డబ్ల్యూ) తిమ్మాపూర్, ఆర్కర్ శివరాజ్ జీపీఏ 9.2, జెడ్పీఎస్ఎస్ రాజుర, విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. ఖానాపూర్ మండల స్థాయిలో 10 తరగతి ప్రతిభ పురస్కారానికి ఎంపిక అయిన ఈ విద్యార్థులకు నగదు పారితోషికం, ఎడ్యుకేషన్ అండ్ ఎంప్లాయిమెంట్ దర్శిని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నిర్మల్ డీఈఓ డాక్టర్ రవీందర్ రెడ్డి, ఖానాపూర్ ఎంఈఓ జి.మధుసూదన్‌ల చేతుల మీదుగా పురస్కారాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టల్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న 5 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న వాచ్మెన్, కుక్, కామాటి, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్‌కు గత 5 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల బడ్జెట్ రిలీజ్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ బడ్జెట్ రిలీజ్ అయిన కార్యాలయంలో లేదా ట్రెజరీలో లేదా ప్రభుత్వం దగ్గర ఎక్కడో ఒకచోట పెండింగ్ ఉండి కార్మికులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఇలా పెండింగ్ ఉండడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో రోజువారి అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులతో కలిసి ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, యూనియన్ జిల్లా కన్వీనర్ సత్యశ్రీ, కోకన్వీనర్ జె.లత, కవిత, సలీం, సంగీత పాల్గొన్నారు.

శిక్షణలో నేర్చుకున్న వాటిని ఉపయోగించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపయోగించుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా మొదటి



నుంచి కృషి చేయాలన్నారు. వృత్యంతర శిక్షణలో తెలుసుకున్న ప్రతి అంశాన్ని నిత్య జీవితంలో బోధనలో ఉపయోగించుకోవాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు ఆంగ్ల మాధ్యమంలో రాయాల్సి ఉంటుందని విద్యార్థులను మొదటి నుండి సిద్ధం చేయాలన్నారు. గిరిజన విద్యా వ్యవస్థ బలోపేతం కావడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసిఎంఓ ఉద్దవ్, కోర్స్ డైరెక్టర్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, డీఆర్పీ వామన్ రావు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ డివి శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పోలీస్ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఉండాలని ఎస్పీ డివి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని డీసీఆర్బీ, ఐటి కోర్, డీపీఓలోని పలు విభాగాల రికార్డులను తనిఖీ చేయడంతో పాటు వాటి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ విభాగాలలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. అదే సందర్భంలో ఎక్కడ రికార్డులు, కేసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.



భరోసా సెంటర్ పరిశీలన

జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్ పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలతో భరోసా సెంటర్‌కు వచ్చే వారికి చేయూత కలిగించాలన్నారు. మహిళల రక్షణకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, ఎస్బీ సీఐ రాణాప్రతాప్, డీసీఆర్బీ సీఐ రమేష్, అడ్మిన్ ఆర్ఐ పెద్దయ్య ఎంటి ఆర్ఐ అంజన్న, భరత్ భూషణ్, ఏఓ శ్రీనివాస్, పాల్గొన్నారు.

రేపు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఆదివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి సీతక్క కాగజ్‌నగర్‌కు రానున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని రెండు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు (సబ్ సెంటర్లు), మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద మిషన్ భగీరథ (అర్బన్) పథకం ప్రారంభోత్సవంతో పాటు మండలంలోని రాంనగర్ విలేజ్ నెంబర్ 12లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఆయన వివరించారు. కాగా స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో మంత్రి సభ నిర్వహిస్తుండడంతో ఈ ఏర్పాట్లను నాయకులు పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, ఏఈ అనిల్‌లతో కలిసి బీజేపీ నాయకులు సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు టీవీ రమణారావు పరిశీలించగా, తర్వాత



మంత్రి సీతక్క సభ ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న నాయకులు

సిర్పూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్ తన పార్టీ అనుచరులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

బస్సు పాసుల కోసం దరఖాస్తు స్వీకరణ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ ఆర్టీసీ ఇచ్చే రాయితీపై బస్సు పాసుల కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగ అభ్యర్థులు తమ వెంట సదరమ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని రావాలని తెలిపారు. అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

2న మండల సమావేశం

నవతెలంగాణ - వాంకిడి

వచ్చే నెల 2న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ విమలాబాయి తెలిపారు. ఈ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలని కోరారు.

దేవునిగూడలో వనభోజనాలు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని దేవుని గూడా గ్రామంలో శుక్రవారం ఉదయం గ్రామస్తులు వనభోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా బయలుదేరి గ్రామ సమీపాన ఉన్న అడవిలోకి వెళ్లారు. అక్కడ వనదేవతకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. మొక్కుల అనంతరం గ్రామస్తులంతా కలిసి సామూహికంగా వనభోజనాలు చేస్తామని గ్రామస్తులు కొంతం సత్తన్న, దేవయ్య తెలిపారు.

ఎస్సీ బాలుర వసతి గృహంలో అడ్మిషన్లు

నవతెలంగాణ- ఖానాపూర్

పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో అడ్మిషన్లు జరుగుతున్నాయని వసతి గృహ సంక్షేమాధికారి భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వసతి గృహంలో 80 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ప్రవేశం పొందాలనుకునే వారు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టిసి, ఆధార్ కార్డు, 4 ఫొటోలతో రావాలని సూచించారు. వివరాలకు 8179060167 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

శాతం తగ్గింది..స్థానం మిగిలింది

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లాలో పాస్ అయిన విద్యార్థుల శాతం తగ్గింది. గత మార్చిలో నిర్వహించిన రెగ్యులర్ పరీక్ష ఫలితాల స్థానాన్ని మాత్రం నిలబెట్టుకుంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో గత ఏప్రిల్ ఫలితాల్లో 31 వ స్థానంలో నిలువగా, ప్రస్తుతం కూడా అదే స్థానంతో జిల్లా సరిపెట్టుకుంది. మార్చిలో నిర్వహించిన రెగ్యులర్ పరీక్షల్లో 83శాతం ఫలితాలతో 31వ స్థానంలో ఉండగా ప్రస్తుతం ప్రకటించిన సప్లమెంటరీ ఫలితాల్లో 62.25 శాతంతో అదే స్థానంలో నిలిచింది. జిల్లాలో సప్లమెంటరీ పరీక్షల్లో 1110 మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో 691 మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో ఆసిఫాబాద్ జిల్లా తర్వాత జగిత్యాల 32 స్థానంలో నిలువగా భద్రాద్రి కొత్తగూడెం చివరి స్థానంలో నిలిచింది. ఏదేమైనా జిల్లా విద్యాధికారులు స్థానాన్ని మెరుగుపరచుకోవడానికి విద్యార్థులను మొదటి నుండి సిద్ధం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెద్దవాగు ప్రవాహంలో పశువులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని అందవెల్లి పెద్దవాగులో శుక్రవారం పశువులు ఈదుకుంటూ వెళ్లిన ఘటన వైరల్‌గా మారింది. గ్రామానికి చెందిన సుమారు 50 పశువులు ఉదయం అందవెల్లి నుంచి జగన్నాథ్‌పూర్ వైపు మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో వాగులో ప్రవాహంలో దాటుకుంటూ వెళ్లగా కొంత మంది వీడియోలు తీసి వైరల్ చేశారు. కొద్దిసేపటికే పశువులన్నీ ఒడ్డుకువచ్చి తమ దారిలో వెళ్లిపోయాయి. కొన్నేళ్లుగా పశువులు వాగుదాటి వెళ్లి రావడం పరిపాటేనని గ్రామస్తులు తెలిపారు. ఈదుకుంటూ వెళ్తుండగా దృశ్యాలను వీడియోతీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో సమస్య తీవ్రతరంగా కనిపించింది. వాస్తవానికి ఈదుకుంటూ వెళ్లిన పశువులు అందవెల్లి రేవుకు కొంత దూరంలోనే సురక్షితంగా బయటపడ్డాయి. కొట్టుకుపోతున్న పశువుల వీడియోలను చూసిన ప్రతి ఒక్కరూ పశువులు మృతి చెందినట్టు భావించారు. వాస్తవానికి దూరప్రాంతానికి బయటపడ్డ విషయం తెలియకపోవడంతో సామాజిక మాధ్యమాల్లో అదేనిజంగా ప్రచారం జరిగింది.

నిల్వ ఉంచిన ఇసుక పట్టివేత



నవతెలంగాణ-పెంచికల్ పేట్

మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను మైనింగ్ శాఖ ఏడి గంగాధర్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి తనిఖీ చేసి పట్టుకున్నారు. మండల కేంద్రంలో నాలుగు సిమెంటు ఇటుకల బట్టిలా వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను పరిశీలించి వారికి జరిమానా విధించారు. మొత్తం 235 ట్రిప్పుల ఇసుక అక్రమంగా ఉందని, ట్రిప్పుకు రూ. 1400 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నిర్మాణాలకు తప్పనిసరిగా పంచాయతీ కార్యదర్శులు అనుమతి తీసుకోవాలని అన్నారు. వారి వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపాల్ ఉన్నారు.

సౌకర్యాల కల్పనకు కృషి చేస్తా



నవతెలంగాణ-సిర్పూర్(టి)

నియోజవర్గంలోని ప్రతి గ్రామంలో సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం వేంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడలో ఆదిమ గిరిజనుల ఆవాసాన్ని పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిమ తెగకు చెందిన కొలాంగూడ గ్రామస్తులకు అన్ని సౌకర్యాలతో కూడిన గ్రామాన్ని నిర్మిస్తామని, ఇది వరకే ఈ గ్రామానికి నెల రోజుల క్రితం విద్యుత్ సౌకర్యం కల్పించామని తెలిపారు. గ్రామానికి రోడ్డు సౌకర్యంతో పాటు ఇండ్లు మంజూరు చేయించి జీవనోపాధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, గొల్లెన మనోహర్, మడావి భీంరావు, జాడి దీపక్, కుమార స్వామి, పంబాల రాజు, అంగళ్ల సన్నీ, సాయి ఉన్నారు.

నేడు అమ్మపేరుమీద మొక్కలు నాటుదాం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని వంజీరి చెక్‌పోస్టు సమీపంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో 'అమ్మపేరుమీద మొక్క నాటుదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు సిందం శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుందని, ముఖ్యఅతిథిగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు హాజరు కానున్నారని తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | జూన్ 29, 2024 | www.navatelangana.com

ప్రమాదకరంగా కోల్ టెస్టింగ్ ల్యాబ్



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక జీటీ హాస్టల్లోని కోల్ టెస్టింగ్ ల్యాబ్ భవనం ప్రమాదకరంగా మారింది. మరమ్మత్తులు చేపట్టాలని హెచ్ఎంఎస్ యూనియన్ మందమర్రి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రధాన ల్యాబ్ హాల్‌లోనే పెచ్చులు రాలిపడుతున్నాయని తెలిపారు. పనిచేసే కార్మిక ఉద్యోగులకు రక్షణ ఉండటంలేదని, చిన్న వర్షానికే ల్యాబ్ హాల్ కూలిపోయె పరిస్థితిలో ఉందని మండిపడ్డారు. ప్రమాదం జరగకముందే అధికారులు సరైన మరమ్మత్తులు చేయాలని, లేదా సురక్షితమైన భవనంలోకి ల్యాబ్‌ను మార్చాలని డిమాండ్ చేశారు.

ఎస్టీపీపీ జీఎంను సన్మానించిన బీఎంఎస్ నాయకులు



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ జీఎం బస్విరెడ్డిని భారతీయ మజ్దూర్ సంగ్ నాయకులు శాలువాతో సన్మానించారు. జీఎంగా పదవి విరమణ పొందనున్న బసివిరెడ్డిని శుక్రవారం బీఎంఎస్ నాయకులు కలిశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జనరల్ సెక్రెటరీ దుస్సా భాస్కర్, ఉపాధ్యక్షుడు చిలుకాని వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడకుంట శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ కళ్యాణపు సతీష్, పాత కృష్ణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం లేకుండా విస్తరాకులు తయారు చేయాలి



నవతెలంగాణ-జైపూర్

విస్తరాకుల తయారిలో ప్లాస్టిక్ వినియోగం ఏమాత్రం లేకుండా జాగ్రత్తపడాలని డీఆర్‌డీఓ కిషన్ సూచించారు. మండల కేంద్రంలో గల ఆదివాసీ మోదుగు విస్తారాకుల కేంద్రాన్ని సందర్శించిన ఆయన విస్తారాకుల తయారిని ప్రసంశించారు. శుక్రవారం మండల కేంద్రానికి వచ్చిన ఆయన స్థానికంగా ఉన్నటువంటి అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి కేంద్రానికి వచ్చే బాలబాలికలకు పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. అదేవిధంగా బాలబాలికలకు పంపిణీ చేస్తున్న పోషక ఆహారాన్ని తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల, పల్లెప్రకృతి వనం సంధర్శించిన ఆయన పిచ్చి మొక్కలు లేకుండా పల్లెప్రకృతి వనంలో పెంచుతున్న మొక్కలు ఏపుగా ఎదిగే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ రాధ రాథోడ్, ఎంపీఓ శ్రీపతి బాపు, ఈసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేసిన సేవలు గుర్తుండిపోతాయి

- మండల ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ



నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, ఉద్యోగున్నతులు సహజమేనని కానీ ప్రజలకు వారు చేసిన సేవలే గుర్తుండిపోతాయని మండల ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్, రాంపూర్, తపాలాపూర్ గ్రామాలకు ఏఎన్ఎంగా విధులు నిర్వహించి సూపర్‌వైజర్‌గా వేమనపల్లికి ఉద్యోగున్నతిపై వెళ్లిన నక్క అపరంజి పరంధాం దంపతులను మండల ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ శాల్వా పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరంజి ఏఎన్ఎమ్‌గా గత ఆరు సంవత్సరాలుగా ఈ మూడు గ్రామాల్లో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు అందుకున్నారన్నారు. కరోనా సమయంలో వారి సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ గ్రామం మాజీ ఉపసర్పంచ్ చిందం చంద్రయ్య, హెల్త్ సూపర్‌వైజర్ కమలాకర్, ఎమ్మెల్ హెచ్పి సందీప్, ఏఎన్ఎం మాధవి, అంగన్‌వాడీ టీచర్లు కవిత, శ్రీవాణి, జమున, జాడి సంజీవరాణి, ఆశ కార్యకర్తలు రజిత, విజయ, లలిత, రజిత, రాజమణి, వసంత పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగులో వరి వేసి అధిక దిగుబడులు సాధించొచ్చు

నవతెలంగాణ-జన్నారం

ఆయిల్ పామ్ సాగులో సీడ్ డ్రిల్ పరికరం సహాయంతో వరి విత్తనాలు వేయవచ్చని, దాంతో మంచి దిగుబడి సాధించవచ్చు అని జన్నారం మండలం వ్యవసాయ అధికారి సంగీత అన్నారు. శుక్రవారం రేండ్లగూడ గ్రామంలో 8 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ తోట సాగు చేస్తున్న అల్లం లచ్చన్న సీడ్ డ్రిల్ సహాయంతో నూతన పద్ధతిలో వ్యవసాయం ప్రారంభించి గత సంవత్సరం ఎకరానికి 25 క్వింటాళ్ల వడ్లు పండించాడని, ఇలా సీడ్ డ్రిల్ ద్వారా వడ్లు వేయడంతో అధిక దిగుబడి వస్తుందని వారు రైతులకు సూచించారు. ఖర్చు చాలా తక్కువ అవుతుందని అన్నారు. ఇందులో భాగంగా ఆయిల్ ఫామ్ తోటలో సీడ్ డ్రీల్ సహాయంతో వరి విత్తనాలు వేశారు. ఈ కార్యక్రమంలో జన్నారం ఏఈఓ త్రిసంధ్య రైతులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం



కాసిపేట : సామాజిక సేవా కార్యక్రమాలతో అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్న బన్న లక్ష్మణ్ దాసును శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో అంబేద్కర్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సంధర్బంగా లక్ష్మణదాసును శాలువాలు, పంచశీల కిరీటం, పూల బొకేతో సన్మానించారు. బన్న లక్ష్మణ్ దాసు అంబేద్కర్ జాతీయ అవార్డు రావడం కాసిపేట మండలానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు జాడి పోశం, సలహాదారులు మద్దినేని చిన్న భీమయ్య, పల్ల మల్లయ్య, సీపీఐ మండల కార్యదర్శి దాగం మల్లేష్, లంక లక్ష్మణ్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొమ్ముల బాపు, మండల కార్యదర్శి దాసరి రాజన్న, గోదారుల శంకర్, అగ్గి స్వామి, రత్నం రాజం, రామటెంకి వాసుదేవ్, దాగం రాజలింగు పాల్గొన్నారు.

ఐహెచ్ఆర్సీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అజయ్

జన్నారం : ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కాన్ఫిడరేషన్ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పెండెల అజయ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఐహెచ్ఆర్సీ అధ్యక్షుడు వీఎల్ రాజు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాతంగి హనుమయ్య నియామక పత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. పేదల పక్షాన పోరాటం చేయాలని సూచించారు.

బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం ఆపాలి



నవతెలంగాణ-నస్పూర్

కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను ఆపాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మిడివెల్లి రాజకుమార్ అన్నారు. శుక్రవారం సీసీసీ నస్పూర్ మండలంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి వేలం వేస్తుందని, సింగరేణి కంపెనీ కూడా ప్రయివేట్ సంస్థలతో వేలంపాటలో పోటీ పడాలని నిర్ణయించిందని మండిపడ్డారు. తెలంగాణలో సింగరేణి కాలరీస్ బొగ్గు గనుల తవ్వకం కోసమే స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థ సహజంగానే శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలి కానీ వేలంపాట ద్వారా ప్రయివేట్ సంస్థలకు అవకాశం ఇస్తున్నదని విమర్శించారు. ఇప్పటికే కొన్ని బ్లాకులు గత బీఆర్ఎస్ పాలనలోని మోడీ ప్రభుత్వం ప్రయివేట్ సంస్థలకు అప్పగించిందన్నారు. మన రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలంపాట ప్రక్రియను ప్రారంభించడం అన్యాయం అన్నారు. బొగ్గు బ్లాక్‌లన్ని ప్రయివేటు సంస్థలకు ఇచ్చిన క్రమంగా సింగరేణి సంస్థ బలహీనపడి మూతపడే వైపు మోడీ ప్రభుత్వం నెట్టుతున్నదన్నారు. ఈ ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు అడ్డుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్కిస్టు కోరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఎస్‌జి గంగాధర చారి, దమ్మాల రాములు, వాయిరాల రాములు, కిషన్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలి

- పేదలపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలి
- బావురావుపేట్‌ను సందర్శించిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు



నవతెలంగాణ-జైపూర్

మండలం బావురావుపేట్ శివారు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ప్రభుత్వ పరంగా ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకుల బృందం డిమాండ్ చేశారు. బావురావుపేట్ శివారులో పేదల గుడిసెలు కూల్చివేసినట్లు తెల్సిన నాయకులు శుక్రవారం సంఘటనా స్థలాన్ని సంధర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య, వాసుదేవ్‌రెడ్డి మాట్లాడుతూ ఏడాదిన్నర క్రితం బావురావుపేట్ శివారు ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకోగా ఇంత కాలం చడిచప్పుడు చేయని కబ్జాదారులు గురువారం వందలాదిగా తరలివచ్చి గుడిసెలు కూల్చివేయడం దారుణమని అన్నారు. బావురావుపేట్ శివారు సర్వే నెంబర్ 8లో గల ప్రభుత్వ అసైండ్ భూమిలో గల కొంత నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. అదే విధంగా గుడిసెల్లో నిల్వ చేసుకున్న నిత్యావసర సరుకులు బియ్యం పప్పు, ఉప్పు నూనె తదితర నిత్యావసర వస్తువులను నేలపాలు చేశారని ఆవేధన వ్యక్తం చేశారు. నిరుపేదలపై జరిపిన దాడిని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి, జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. పేదలకు జరిగిన అన్యాయం పట్ల జిల్లా అధికారులు స్పందించి గుడిసె వాసులకు ఇంటి స్థలాలకు పట్టాదార్ పాసుపుస్తకాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దాడులకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడంతో పాటు బాధితులకు అధికారులు అండగా నిలువాలని కోరారు. అధికారులు సహకరించకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బాధితులతో కలిసి పోరాటం చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జి ప్రకాశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోడంకి చందు, జిల్లా కమిటి సభ్యులు దుంపల రంజిత్ కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుర్గె మోహన్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అరిగెల మహేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అభినవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, చారీ, కరీమా, ఉమారాణి, సమ్మక్క, సరిత, కుమార్, రమాదేవి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగావకాశాలు

- జడ్పీ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మి



నవతెలంగాణ-మంచిర్యాల

బ్యాడ్మింటన్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు గొప్ప పేరు తేవాలని, క్రీడలతో ఎన్నో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గ్రీన్ సిటీలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిక్స్ సన్ రైస్ సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభ వేడుకలకు ముఖ్యఅతిదులుగా నల్లల భాగ్యలక్ష్మి, డీఎఫ్ఓ శివ ఆశిష్, మాజీ విప్ నల్లాల ఓదెలు, మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యాలు హాజరయ్యారు. జాతీయ స్థాయిలో రాణించిన వారికి మంచి అవకాశాలు వస్తాయని, బ్యాడ్మింటన్ క్రీడకు క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉందని మన క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. క్రీడలలో రాణించే వారికి విద్యా ఉద్యోగ అవకాశాలలో మంచి అవకాశాలు వస్తాయి అని ఎక్కడికి వెళ్లినా క్రీడాకారులకు మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. బ్యాడ్మింటన్ క్రీడకు మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గ ప్రసాద్, డివైఎస్ఓ రాజు వీర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మీనారెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేష్‌రెడ్డి, మధు, కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, హర్ష రాజలింగు, కృష్ణ, టోర్నమెంట్ రిఫరీ మల్లికార్జున్, టెక్నికల్ కమిటీ చైర్మన్ టీసీఎస్ రావు, జాయింట్ సెక్రటరీ మనోజ్ పాల్గొన్నారు.

నాణ్యమైన పనిముట్లను సరఫరా చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

గనులలో నాణ్యమైన పనిముట్లను సరఫరా చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా అన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్కే న్యూటెక్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నాణ్యతలేని పనిముట్లు సరఫరా చేయడం వల్ల కార్మికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్డీఎల్‌లలో ఉపయోగించే ఆయిల్స్ నాణ్యత లేనందువలన ఎస్‌డీఎల్ మొరాయించడంతో ఆపరేటర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వర్షాకాలం అయినందున టబ్ రిపేర్ సెక్షన్‌లో కార్మికుల రెస్ట్ హాల్స్‌లో షెడ్స్ పైకప్పులు పగిలి వర్షం నీరు కురుస్తున్నందువల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి నాణ్యమైన పనిముట్లను గ్లౌజులను సరఫరా చేయాలన్నారు. అనంతరం గని మేనేజర్ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు. వారు సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏ సంపత్, ఫిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, బెల్లంపల్లి కాంట్రాక్టు వర్కర్స్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు చంద్రమౌళి సకినాల నరసయ్య, సిద్ధం అజయ్, షాకీర్, రాజయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ.25 వేల విరాళం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతాగూడ గ్రామంలో ఉన్న జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలకు "చింతగూడ ఫౌండేషన్" వ్యవస్థాపక అధ్యక్షుడు కస్తూరి దుబాయ్ రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. శుక్రవారం జడ్పీఎస్ఎస్ పాఠశాలకు వెళ్లి పాఠశాల ప్రధానోపాధ్యాయునికి వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్‌కు ఆ విరాళాన్ని అందించారు. ఆ డబ్బులను పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ఉపయోగించాలని కస్తూరి దుబాయ్ కోరారు.



తుడుందెబ్బ ఆధ్వర్యంలో బడిబాట



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని గట్రావుపల్లి గ్రామంలో శుక్రవారం ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ సమాజం నేటికి వెనుకబాటు తనానికి చదువు కారణమని, ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సాధించాలని, చదువు మధ్యలో ఆపేసిన పిల్లలను బడికి పంపాలని, కాలేజీ మధ్యలో ఆపిన విద్యార్థులను కాలేజీకి పంపాలని తల్లిదండ్రులకు, యువతి యువకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శిగా ఆడ జంగు, విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్, తుడుందెబ్బ మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హనుమంతు, తుడుందెబ్బ కాసిపేట మండలం గౌరవ అధ్యక్షుడు ఆత్రం జంగు, మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య, మండల ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, రాయి సెంటర్ గీతా దార్ సిడం గణపతి, గట్రావుపల్లి గ్రామ పటేల్ అర్క జైతు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు 34 మంది హాజరు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా స్థాయి క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలకు మండల స్థాయిలో నిర్వహించిన పోటీలకు 34 మంది అభ్యర్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజీవు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 3 క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కొరకు అభ్యర్థులకు శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో జిల్లా అధికారుల సంఘం అధ్యక్షులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, మండల విద్యాధికారి పోచయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధారాణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రాంచందర్లు పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీలకు జిల్లాలోని 8 మండలాల నుంచి 7 మంది బాలికలు, 27 మంది బాలురు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీడీ రాజయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమళ, రవి, యాకుబ్, గోపాల్, శ్రీనివాస్, రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ కార్యాలయ సిబ్బంది వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారని తెలిపారు.

మ్యాచింగ్ గ్రాంట్ చెక్కు అందజేత



నవతెలంగాణ-నస్పూర్

ఆర్కే-6 గనిలో జనరల్ మద్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న విలాసాగరపు శ్రీనివాస్ మరణించగా అతనికి రావలసిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.15.24 లక్షల చెక్కులను ఆయన భార్య విలాసాగరపు శ్రీలతకు గని మేనేజర్ ఇ.తిరుపతి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా గని మేనేజర్ మాట్లాడుతూ ఈ మ్యాచింగ్ గ్రాంట్ డబ్బులలో రూ.7 లక్షల 50 వేలు వారి కుమారుడి పేరుపైన ఫిక్సడ్ డిపాజిట్ చేసుకోవాలని, వారికి లభించిన టర్మినల్ బెనిఫిట్స్ సొమ్మును పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఫిట్ సెక్రెటరి సంగం సదానందం, డిప్యూటి జనరల్ సెక్రటరి ముస్కె సమ్మయ్య, ఇ.సంతోష్ కుమార్, గణపతి, మహేష్ పాల్గొన్నారు.

పేదల గుడిసెలు తొలగించిన పోలీసులు



నవతెలంగాణ-దండేపల్లి

మండల కేంద్రంలోని ఓ వైఎస్ఆర్ దండేపల్లి మండల కేంద్రంలోని ఓ వ్యక్తికి చెందిన వ్యవసాయ భూమిలో రాత్రి సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెలు వెలిశాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి వారు ఆక్రమించిన భూమి ప్రభుత్వ భూమి కాదని ప్రయివేట్ భూమని వారికి నచ్చజెప్పి గుడిసెలను కాలీ చేయించారు. అనంతరం సీపీఐ మండల నాయకులు పెరిక రాజేశం ఆధ్వర్యంలో తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పేద ప్రజలకు ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి స్థలం కొరకు పోరాటం చేస్తున్న అధికారులు ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. ఇప్పటికైనా స్థానిక నాయకులు ప్రజా ప్రతినిధులు స్పందించి పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ భూమి లేకుంటే స్థలం కొనుగోలు చేసి పేదలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి గోపికృష్ణ అన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అంగన్వాడీ టీచర్స్, గ్రామ వైద్య, పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామాల్లోని కాలనీల్లో వర్షాకాలంలో డెంగ్యూ, సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వాడని పాత కూలర్, కొబ్బరి బోండాలు, పాత బకెట్‌లు, వాడని టైర్‌లు, వాడని రోళ్లలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు.



రిమ్స్‌లో నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైద్య కళాశాలలోని వైద్యులపై ఇతర శాఖల అధికారుల పర్యవేక్షణను నిరసిస్తూ తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రిమ్స్‌లో వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులపై కలెక్టర్ జారీ చేసిన మెమోను ఉపసంహరించుకోవాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిమ్స్ టీటీజీడీఏ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ కమలాకర్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ సుమలత పాల్గొన్నారు.



ఎంపీ ఇంటి ముట్టడికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు..

- నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతాం
- విద్యార్థి సంఘాల నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నీట్ పరీక్షల్లో అవకతవకలపై సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ జరిపించి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) సంస్థను రద్దుచేసి పేపర్ లీక్ పాలుపడ్డ వారిపై క్రిమినల్ కేసులు నమోదించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని పార్లమెంటరీ సభ్యుడు ఇంటి ముట్టడి కార్యక్రమం చేపట్టారు. రెండు రోజుల కింద ఇదే విషయమై ఎంపీ ఇంటి ముట్టడి చేపట్టగా, ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేసి, అరెస్ట్ చేయడానికి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం ముట్టడికి యత్నించిన క్రమంలో పోలీసులు అడ్డుకొని వాహనంలోకి ఎక్కించుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల కోరిక మేరకు ఎగ్జామ్‌ని మళ్లీ నిర్వహించి, విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పందించకపోతే భవిష్యత్తులో బీజేపీ ప్రభుత్వం మెడలు వంచైన నీట్ విద్యార్థులకు అండగా నిలబడతామని తెలియజేశారు. నీట్ విద్యార్థులకి న్యాయం జరిగేంత వరకు సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తోట కపిల్, సంఘాల నాయకులు రాహుల్, నగేష్, సుజయ్, అశోక్, గంద్రత్ శ్రీకాంత్, కౌడాల అఖిల్, రాహుల్, సాయి పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమగ్ర చట్టానికి పోరాడుదాం

నవతెలంగాణ-ఉట్నూర్

వ్యవసాయ కార్మికులకు సమగ్రమైన చట్టం చేయాలని రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని ఏపీకేఎంఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోయం జుగాదిరావు, కొడప సురేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 60 శాతం మంది వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారని అన్నారు. వారిలో 14 కోట్ల మంది వ్యవసాయ కార్మికులు ఉన్నారు. సేద్యం ప్రారంభం నుంచి విత్తనాలు పెట్టడం, నాట్లు వేయడం, కలుపులు తీయడం, సస్యరక్షణ అన్ని పంటల సేకరణ పంటల కోతలు తదితర పనులు చేస్తూ, చాలీచాలని వేతనాలతో జీవనాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికులకు వేతనాలు కనీసం రూ.600 పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు ఇండ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి కేంద్రం ఐదు లక్షలు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఇవ్వాలని, వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు నాణ్యమైన విద్య వైద్యం ఉచితంగా అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు హామీ ఇచ్చిన విధంగా రూ.12 వేల జీవన భృతిని కల్పించి, వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ప్రీమియం చెల్లించి, రైతులకు ఇచ్చే విధంగా జీవిత బీమా వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు అజ్మీర వినోద్ కుమార్, వ్యవసాయ కూలీలు మడవి రేణుక, రుక్మాబాయి, వనిత, లక్ష్మి బాయి, కుమ్ర లక్ష్మి, టేకం అనిత పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయివేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల్లో అక్రమంగా లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాల పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. కార్యాలయ గేటు దూకేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోగా, ఇరువురికి కాస్త తోపులాట జరిగింది. అనంతరం అక్కడే బైఠాయించి నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అక్షయ్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చి పదేండ్లు గడిచిన కాలంలో పార్టీలు మారాయి, ప్రభుత్వం మారింది కానీ విద్యార్థులు బతుకులు మారలేదన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ బడిలోకి పోలేక గవర్నమెంట్ బడికి వెళ్తే కనీసం ఉండాల్సిన మౌలిక వసతులు కూడా ఉండటం లేదన్నారు. పిల్లలు ఉండే బడిలో పందులు కుక్కలు వస్తున్నాయని తినే ఆహారం కూడా విషంగా మారి ఫుడ్ పాయిజన్‌కు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ బడిలో ఇలా ఉన్నాయని ప్రయివేట్ బడికి వెళ్తే బుక్స్, ఫీజులు యూనిఫామ్‌లు అని విచ్చలవిడిగా దోచేస్తున్నారని అన్నారు. ఈ విషయం గురించి డీఈఓకు తెలియజేస్తే డీఈఓ చూసి చూడనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ మడావార్ హరీశ్, ఉదయ్, మహేష్, నిఖిల్, కార్తీక్, సాయి, శ్రీశాంత్ పాల్గొన్నారు.

ఎద్దులను తరలిస్తున్న కంటైనర్ లారీ బోల్తా

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని కుప్టి ఘాట్ సెక్షన్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఎద్దులను తరలిస్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు ఎస్ఐ శ్రీకాంత్‌కు సమాచారం అందించగా ఆయన సంఘటన స్థలానికి చేరుకున్నారు. కంటైనర్ లారీలో 20 ఎద్దులు ఉండగా అందులో ఐదు మృతి చెందాయి. కంటైనర్ లారీ డ్రైవర్‌తో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. జగిత్యాల మండలానికి చెందిన సతీష్ కుమార్, అనిల్ కుమార్, సాయిగా తేలింది. ఎద్దులను ఇచ్చోడ శ్రీరామ్ గోశాలకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఆలయ 18వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని భుక్తాపూర్‌లో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన 18వ వార్షికోత్సవంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు జోగు రామన్నను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవాటు చేసుకుంటూ, భక్తి భావాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. భక్తి మార్గంలో మానసిక ప్రశాంతత నెలకొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వెనగంటి ప్రకాష్, పాశం రాఘవేంద్ర, పట్టణ అధ్యక్షులు అజయ్, రమణ, శ్రీనివాస్, మాదాస్తు సంతోష్, కోవ రవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్..?

- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో అధికార పార్టీ నాయకుల మంతనాలు
- పదవుల ఆఫర్‌తో గాలం
- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేరికే కారణమా?

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ జిల్లాలో రెండు ఎమ్మెల్యే సీట్లలో ఒకదాన్ని కైవసం చేసుకొని బలంగానే కనిపించింది. అనంతరం సిర్పూర్‌లో బీఎస్పీ తరఫున పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరిక పార్టీలో అగ్గి రాజేసింది. మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప, తమ్ముడు జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి అధికార పార్టీలో చేరారు. దీంతో పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ఢీలా పడింది. పార్లమెంట్ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో అంతా తానై ఓట్లు రాబట్టుకునే ప్రయత్నం చేసిన ఎమ్మెల్సీ దండే విఠల్ రానున్న రోజుల్లో తానే ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని ఆశించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నియోజకవర్గ రాజకీయాల్లో కలగజేసుకోవడంతో ఎమ్మెల్సీకి కొత్త ఇబ్బందులు తెచ్చి పెట్టింది. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీతో మంతనాలు జరపడంతో ఆయన పార్టీ మారుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే బీఆర్ఎస్‌కు భారీ నష్టం కలిగే సూచనలు కన్పిస్తున్నాయి. సిర్పూర్ నియోజకవర్గంలో పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న ఎమ్మెల్సీ దండే విఠల్ పార్టీ మారుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పాటు ఆయన గ్రూపు వారు మాట్లాడుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

మంత్రి పదవి కోసమేనా?

ఇప్పటికే అధికార కాంగ్రెస్ జూలై రెండవ తేదీన మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ప్రకటించిన నేపథ్యంలో అధికార పార్టీ నాయకులతో సహ ప్రతిపక్ష పార్టీ నాయకులు కూడా పార్టీ మారి మంత్రి పదవులు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకరికి తప్పనిసరిగా మంత్రి పదవి ఇవ్వడానికి అధికార పార్టీ నిర్ణయం తీసుకుంది. అయితే ఇప్పటి వరకు జిల్లాలో అధికార పార్టీకి ప్రజాప్రతినిధులు లేకపోవడంతో మంత్రి పదవిపై పెద్దగా చర్చ జరగలేదు. కానీ ఎమ్మెల్సీ విఠల్ ముందస్తుగా మంతనాలు జరిపి మంత్రి పదవి ఆశించి పార్టీ మారుతున్నట్లు ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ అధిష్టానం కూడా ఆ దిశగా అడుగులు వేస్తూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు వినిపిస్తోంది.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేరికే కారణమా?

గత అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఓటమికి ప్రధాన కారణం బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోటీ చేయడమేనని అందరికీ తెలిసిందే. తర్వాత ప్రవీణ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడంతో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు అనేకమంది పార్టీ మారారు. నియోజకవర్గ బాధ్యతలు తనపై వేసుకున్న ఎమ్మెల్సీ భవిష్యత్తులో తనకు అవకాశం వస్తుందని భావించినప్పటికీ ప్రవీణ్‌కుమార్ మళ్లీ నియోజకవర్గ రాజకీయాల్లో కల్పించుకోవడంతో ఎమ్మెల్సీకి కొత్త ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. భవిష్యత్తులో టికెట్ రాదని భావించిన ఎమ్మెల్సీ పార్టీ మారుతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయం ఎమ్మెల్సీని అడగగా అధికార పార్టీ నాయకులు అందరితో మాట్లాడినట్టే తనతో మాట్లాడారని, అయితే మంత్రి పదవి లాంటివి తనతో మాట్లాడలేదని తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌కు నాగర్‌కర్నూల్ కేటాయించినప్పటికీ సిర్పూర్‌లో తిరగడం కార్యకర్తలకు మింగుడు పడడం లేదన్నారు. భవిష్యత్తులో కార్యకర్తల నిర్ణయం మేరకు వ్యవహరిస్తానని తెలిపారు.

వర్షాకాలం దృష్ట్యా ముందస్తు చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-నిర్మల్

వర్షాకాలం నేపథ్యంలో భారీ వర్షాలు, వరదల వలన ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భారీ వర్షాలు, వరదల వలన ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చేపట్టవలసిన ముందస్తు చర్యలపై ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆమె సంబంధిత శాఖల అధికారుతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల వలన జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరదలు సంభవించినప్పుడు స్వర్ణ, కడెం, గడ్డెన్నవాగు ప్రాజెక్టులు, అలాగే గోదావరి పరివాహక లోతట్టు ప్రాంతాల గ్రామాలకు ముందస్తు సమాచారం అందించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చూడాలని తెలిపారు. పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీలో గత వరదల వలన జరిగిన నష్టం పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. డిసాస్టర్ మేనేజ్మెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. దోమల వలన సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సానిటేషన్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. రహదారులు, వీధులలో వర్షపు నీరు నిల్వకుండా వెంట వెంటనే తొలగించి ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. దోమల వ్యాప్తి నియంత్రించేందుకు ఫాగింగ్ ప్రక్రియను నిరంతరం చేపట్టాలన్నారు. పంచాయితీరాజ్, మున్సిపల్ యాక్ట్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల వలన ఎలాంటి నష్టం వాటిల్లకుండా నియంత్రించేందుకు పోలీస్ శాఖ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు వెంటనే సమాచారాన్ని పోలీస్ వారికి అందించాలన్నారు. ఎలాంటి ఘటనలు సంభవించకుండా రెవెన్యూ, పోలీస్, విద్యుత్, అటవీ, పంచాయితీ, మున్సిపాలిటీ శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం నీటి పారుదల శాఖాధికారులు జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల సమాచారాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తూ ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు పరిష్కరించినవి, ఇంకా పరిష్కారంకాని వాటిపై తహసీదార్లతో చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అటవీ శాఖాధికారి ప్రసాద్, డీఆర్వో భుజంగరావు, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అవుట్‌సోర్సింగ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఈ విషయమై శుక్రవారం తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ డా.నరేందర్ రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు దాదాపు 30 మంది వరకు గ్రామీణ ప్రాంతాల్లో వివిధ పీహెచ్‌సీలలో పనిచేస్తున్నారన్నారు. వీరికి ఎంసిహెచ్ కిట్, ఐడి నెంబరు ఇవ్వడం లేదని, అక్కడ ఉన్న ఏఎన్ఎంల లాగిన్‌లోనే ఆన్‌లైన్ చేస్తున్నారని పేర్కొన్నారు. అక్కడున్న సూపర్వైజర్లు, ఏఎన్ఎం నుండి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వెంటనే ఐడి నెంబర్ ఇవ్వాలని కోరారు. సంబంధిత ఏజెన్సీ వేతనాలను బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయకుండా ఫోన్ పే ద్వారా చెల్లిస్తోందని, దాదాపు రూ.2వేల వరకు తక్కువ వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐలో కట్ చేసిన డబ్బులను జమ చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి డీఎంహెచ్ఓ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, ఏఎన్ఎంలు కవిత, విద్య సుజాత ఉన్నారు.



గర్భిణులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం డాక్టర్ రాంబాబు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కొత్తపెల్లి(జి), భీంపూర్, ఎంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మొత్తం 35 మందిని పరీక్షించారు. రక్త పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచిత మందులు పంపిణీ చేశారు. తీసుకునే జాగ్రత్తలపై వివరించారు. వైద్య శిబిరంలో సిహెచ్ఓ లక్ష్మి, హెచ్ఈఓ నాందేవ్, పిహెచ్ఎన్ఓ సుశీల, సత్తవ్వ, హెల్త్ సూపర్వైజర్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది రాజమణి, సరిత, శ్యామల, ఆశాలు సుజాత, అరుణ, సున్నా, రుక్మాబాయి, లేతుబాయి, మారుబాయి, మోతుబాయి పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని బంగారుగూడలోని ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం, రామాయి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం కలెక్టర్ రాజర్షిషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొదటగా ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడేలో భాగంగా బంగారుగూడ కాలనీలో పర్యటించి, కాలనీ సమస్యలపై ఆరాతీశారు. ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలం సందర్భంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. చుట్టు ప్రక్కల, రోడ్ల పైన, ఇండ్లల్లో ఉండే కూలర్లు, రంజన్‌లు, కొబ్బరి బోండాలు, తదితర వాటిలో నీరు నిలువ లేకుండా పరిశుభ్రత పాటించాలని పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. ఈ సీజన్‌లో దోమలు, ఈగలు వాలకుండా శుభ్రత పాటించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కాలనీలో ఉన్న సమస్యలను విని సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం బంగారుగూడ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలను పరిశీలించి, విద్యార్థులతో పాఠాలు చదివించి, బోర్డ్ పై రాయించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు యూసఫ్ ఖాన్‌ను ఉర్దూతో పాటు ఇంగ్లీష్ కూడా నేర్పించాలని, విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారి నైపుణ్యాన్ని వెలికి తీయాలని అన్నారు. వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో బాధ్యతగా వ్యవహరించాలని, బోధన సరిగా లేదని, చదవడం రాయడంలో శ్రద్ధ వహించాలని తెలిపారు. రామాయి మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించి, మధ్యాహ్నం భోజనం ను పరిశీలించి, నాణ్యతతో కూడిన ఆహారం అందించాలనీ, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా వినియోగించాలని, కిచెన్ షెడ్ ఏర్పాటు చేయాలని పరిసరాలు బాగుండి, సరైన విద్యా బోధనా ఉంటేనే పిల్లలు బాగా చదువుతారని అన్నారు. ప్రాథమిక పాఠశాల నుండి పిల్లలకు వారి భాషతో పాటు ఇంగ్లీష్‌లో రాయడం, చదవడం నేర్పించాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనలో భాగంగా పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. తరగతి గదులు, టాయిలెట్స్, రన్నింగ్ వాటర్ పరిశీలించి, స్కూల్ బిల్డింగ్ పైబాగంలో నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని, తరగతి గదుల్లో వర్షం నీరు పడకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఖమ్మర్ అహ్మద్, ఎంఈఓ, తహసీల్దార్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంబంధితశాఖ అధికారులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ పథకంపై సమీక్ష

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రధాన మంత్రి జన జాతీయ న్యాయ మహా అభియాన్ పథకంపై ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ పథకానికి అర్హులైన లబ్ధిదారులకు ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు 15 రోజుల్లో కచ్చితంగా పూర్తి చేయాలని ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల తహసీల్దార్లను ఆదేశించారు. అలాగే ఐటీడీఏ కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విడివికె పథకం ద్వారా శిక్షణ పొందుతున్న శిక్షణార్థుల గురించి శిక్షణ అధికారి సురేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. జన్ మన్ ద్వారా అర్హులైన అదిమ గిరిజనులకు బ్యాంక్ ఖాతాలు తెరిచి, క్రాప్ లోన్లు అందేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిడి దిలీప్ కుమార్, డిఎమ్‌హెచ్ఓ నరేందర్, ఏడిఎమ్ఓ మనోహర్, డిటిడిఓ రమాదేవి, జెడిఎమ్ నాగభూషణం పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కోవలక్ష్మి 76మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇంకా మండలంలో చాలా మందికి కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు రావాల్సి ఉందని, వారికి కూడా త్వరలోనే చెక్కులు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ తుకారాం, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌ను కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డివి శ్రీనివాసరావును ఎమ్మెల్యే కోవలక్ష్మి, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్‌తో కలిసి కలిశారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని శాంతిభద్రతలు, జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ సమస్యలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో నాయకుడు అమన్ పాల్గొన్నారు.

భిన్న పార్టీల నాయకులు ఒకే చోట

మొన్నటి వరకు అందరూ ఒకే పార్టీలో ఉన్నప్పటికీ ప్రస్తుతం వేరువేరు పార్టీలో ఉన్న నాయకులు ఒకే చోట కలిశారు. ఎస్పీని సన్మానించే సందర్భంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, బిజెపి జెడ్పీటీసీ నాగేశ్వరరావు, కాంగ్రెస్ ఎంపీటీసీ మల్లేష్ ఒకేచోట కలిసి ఎస్పీని సన్మానించారు.

బిజినెస్

శ్రీరామ్ ఫార్మ్ నుంచి ఐదు పంట సంరక్షణ ఉత్పత్తులు



హైదరాబాద్ : ఐదు రకాల నూతన తరం పంట సంరక్షణ, స్పెషాలిటీ ప్లాంట్ న్యూట్రిషన్ ఉత్పత్తులను ఆవిష్కరించినట్లు శ్రీరామ్ ఫార్మ్ సొల్యూషన్స్ తెలిపింది. హైదరాబాద్‌లో వీటిని ఛానెల్ భాగస్వాముల సమక్షంలో విడుదల చేసినట్లు ఆసంస్థ పేర్కొంది. కలుపు నిర్వహణ పరిష్కారానికి శ్రీరామ్ బికుటాను పరిచయం చేసినట్లు వెల్లడించింది. అదే విధంగా తన క్రిమిసంహారక పోర్ట్‌ఫోలియోలో శ్రీరామ్ సైషో, శ్రీరామ్ క్రోన్, శ్రీరామ్ ట్రిక్చురల్, స్పెషాలిటీ ప్లాంట్ న్యూట్రిషన్ అయినా శ్రీరామ్ ప్రోటోబజ్‌ను పరిచయం చేసినట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ చబ్రా తెలిపారు.

ఏపీ, తెలంగాణ రైతులకు స్వరాజ్ అధునాతన పడ్లింగ్ సొల్యూషన్స్



నవతెలంగాణ - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలో ప్రత్యేకంగా మాగాణి నేలల్లో సాగులో తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు మహీంద్రా గ్రూప్లో భాగమైన స్వరాజ్ ట్రాక్టర్స్ సమగ్రమైన పడ్లింగ్ సొల్యూషన్స్ను అందిస్తోంది. స్వరాజ్ 843 ఎఫ్ఎం, 742 ఎక్సీ, 744 ఎఫ్ఎస్ఈ మరియు స్వరాజ్ 855 ఎఫ్ఎస్ఈ అనే స్వరాజ్ మోడల్స్ లో అధునాతన ఫీచర్లు పొందుపర్చబడ్డాయి. ఇవి అధిక సామర్థ్యంతో, మెరుగైన నియంత్రణతో, ఉపయోగించేందుకు మరింత సులభతరంగా ఉంటాయి. తద్వారా రైతులకు పబ్లింగ్ పనుల్లోను, వరి సాగులోను ఇవి సరైన ఎంపిక కాగలవు. స్వరాజ్ ట్రాక్టర్లు 4-వీల్ డ్రైవ్ ఆప్షన్తో లభిస్తాయి. తడి, బురద నేలల్లో కూడా ఇవి అత్యుత్తమ కర్షణ సామర్థ్యాన్ని అందిస్తాయి. పనులు నిరాటంకంగా సాగేందుకు, జారి పడే సమస్యలు తలెత్తకుండా ఇవి సమర్థంగా పని చేస్తాయి. అంతేగాకుండా, ఇండిపెండెంట్ పవర్ టేక్-ఆఫ్ (ఐపీటీవో) వల్ల పీటీవో-చాలిత సాధనాలపై పూర్తి నియంత్రణ లభిస్తుంది. అలాగే పనితీరు, విశ్వసనీయత కూడా మెరుగ్గా ఉంటుంది. ఈ ట్రాక్టర్లలో 12 ఫార్వర్డ్, 3 రివర్స్ గేర్లతో విస్తృతమైన స్పీడ్ శ్రేణి ఉంటుంది.

టెక్ ప్లాట్‌ఫారమ్‌తో బీమా ఆఫర్‌ను పునర్నిర్వచిస్తున్న హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో

నవతెలంగాణ - హైదరాబాద్

భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ సాధారణ బీమా సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, తన ప్రధాన కార్యాచరణ వ్యాపార ప్రక్రియల పునరుద్ధరణతో ఒక మైలురాయి చేరవను సగర్వంగా ప్రకటిస్తోంది. డక్ క్రీక్ ప్లాట్‌ఫారమ్‌కు చెందిన నూతన-తరపు సాంకేతిక సామర్థ్యాలను ఉపయోగించుకోవడం, భారీ కార్యాచరణ సామర్థ్యాలతో 'డిజిటల్ ఫస్ట్' బీమా సంస్థ నిబద్ధత దిశగా సంస్థ ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరణతో, బీమా సంస్థ ఇప్పుడు వినియోగదారులకు మెరుగైన అంతరాయం లేని, సహజమైన అనుభవాలను అందించేందుకు మరియు మెరుగైన హైపర్ పర్సనలైజ్డ్ బీమా పరిష్కారాలను అందించేందుకు సిద్ధంగా ఉంటుంది. అంతేకాకుండా, ఈ నూతన-తరపు సాంకేతికత బీమాను మరింత సరసమైనదిగా, ఎక్కువమంది వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అనుకూలీకరించిన ఉత్పత్తుల రోల్-అవుట్, నూతన తరపు ఇన్‌సర్‌టెక్‌లతో టై-అప్ చేయడం ద్వారా ఎక్కువ విభాగాలకు నూతన వినియోగదారులు చేరుకునేందుకు బీమా సంస్థను అనుమతిస్తుంది.

జైస్వాల్‌ను ఓపెనర్ పంపించాలి: శ్రీశాంత్

నవతెలంగాణ - హైదరాబాద్

ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్ కప్ 2024లో రోహిత్ శర్మతో కలిసి ప్రారంభించడంపై ప్రముఖ క్రికెటర్ శ్రీశాంత్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. యశస్వి జైస్వాల్‌ను చూడటానికి నేను ఇష్టపడతాను అని పేర్కొన్నారు. "విరాట్ కోహ్లి మూడవ స్థానంలో (నంబర్ 3) వస్తున్నందున ఈ టీ20 ఫార్మాట్లో రోహిత్ శర్మతో కలిసి యశస్వి జైస్వాల్ ఇన్నింగ్ ప్రారంభిస్తే బాగుంటుంది. ఈ విషయంలో విరాట్ కోహ్లి వద్ద తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించే స్వేచ్ఛ యశస్వి జైస్వాల్కు ఉంటుంది. నా తర్వాత బ్యాటింగ్ చేసేందుకు విరాట్ భాయ్ (విరాట్ కోహ్లి) ఉన్నాడనే ధైర్యంతో రోహిత్ శర్మ షీట్-యాంకర్ పాత్రను పోషిస్తే, యశస్వి జైస్వాల్ స్వేచ్ఛగా ఆడేందుకు అవకాశం ఉంటుంది. విరాట్ కోహ్లి వచ్చి ఇన్నింగ్స్ను స్థిరీకరించి స్కోర్ను బోర్డుపై ఉంచుతాడు లేదా యశస్వి జైస్వాల్ బౌలింగ్ తర్వాత ఓపెనింగ్ చేయడం, విరాట్ కోహ్లి వచ్చి రోహిత్ శర్మతో ఆటను ముగించడం వంటివి ఏమీ ఇబ్బంది కలిగించవు" అని అభిప్రాయపడ్డారు. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2024 డిస్నీ హాట్‌స్టార్లో మొబైల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది.

ఒకే వేదికపైకి చంద్రబాబు, రేవంత్..

- వచ్చే నెల 20,21 తేదీల్లో హైదరాబాద్‌లో కమ్మ మహాసభ
- హాజరుకానున్న ఇరువురు సీఎంలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌లు ఒకే వేదికను పంచుకోనున్నారు. వచ్చే నెల 20,21 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే కమ్మ మహాసభకు వారిద్దరూ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. సీఎంలుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు, రేవంత్ ఇప్పటి వరకూ కలుసుకోలేదు. అందువల్ల జులైలో వారి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. గత డిసెంబరులో రేవంత్ సీఎంగా ప్రమాణం చేసినప్పటికీ... అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌తో భేటీ కాలేదు. అటు వైపు నుంచి జగన్ కూడా రేవంత్‌ను కలవలేదు. ఈలోగా ఏపీలో ఎన్నికలు రావటం, ఆ తర్వాత జగన్ ఓడిపోవటం చకచకా జరిగాయి. అనంతరం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి రేవంత్‌కు ఆహ్వానం అందిందా? లేదా ? అన్నది తెలియదు గానీ, ఆయన ఆ కార్యక్రమానికి హాజరు కాలేదు. చంద్రబాబు ఎన్డీయే కూటమిలో ఉన్న నేపథ్యంలో... ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎంగా రేవంత్ ఆ కార్యక్రమానికి గైర్హాజరయ్యారనే అభిప్రాయాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో త్వరలో జరగబోయే వీరిద్దరి భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఒకే వేదికను పంచుకోనున్న సీఎంలు ఇరు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలపై చర్చిస్తారా? లేదా..? అన్నది వేచి చూడాలి. కాగా కమ్మ మహాసభకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా హాజరుకానున్నారని నిర్వాహకులు జెట్టి కుసుమకుమార్ తెలిపారు.

పాడి రైతులు ఆందోళన చెందొద్దు

- విజయా డెయిరీ ప్రకటన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

విజయ తెలంగాణ పాడి రైతులకు గిట్టుబాట ధర కల్పించాలనే సదుద్దేశంతో ఎన్నడూ లేని విధంగా పాల సేకరణ ధరను పెంచామని విజయ డెయిరీ అని ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో పాలసేకరణ పెరగడంతో రైతులకు చెల్లించాల్సిన బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నదని తెలిపింది. రైతులు ఆందోళన చెందొద్దనీ, త్వరలోనే బకాయి బిల్లులు చెల్లిస్తామని రైతులకు విజ్ఞప్తి చేసింది.

గెస్ట్ లెక్చరర్లు కొనసాగింపు

- ఇంటర్ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,654 మంది గెస్ట్ లెక్చరర్లను 2024-25 విద్యాసంవత్సరంలో కొనసాగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ శృతి ఓజా శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. గత విద్యాసంవత్సరంలో పనిచేసిన వారిని ప్రస్తుత విద్యాసంవత్సరంలోనూ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను విడుదల చేయడం పట్ల గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్ హర్షం ప్రకటించారు.

జులై 18 నుంచి డీఎస్సీ రాతపరీక్షలు

ఆగస్టు 5 వరకు నిర్వహణ

- ఆన్‌లైన్‌లో రోజు రెండు విడతల్లో
- పూర్తిస్థాయి షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మెగా డీఎస్సీ రాతపరీక్షలు కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో ఆన్‌లైన్‌లో వచ్చేనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగస్టు ఐదో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. పోస్టు కేటగిరీ, మాధ్యమం వారీగా డీఎస్సీ రాతపరీక్షలకు సంబంధించిన పూర్తిస్థాయి షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం విడుదల చేశారు. మెగా డీఎస్సీకి 2,79,966 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సంగతి విదితమే. ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో రెండో విడతల్లో రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేనెల 18న మొదటి విడతలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్), స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) తెలుగు మాధ్యమం అభ్యర్థులకు రాతపరీక్షలుంటాయని పేర్కొన్నారు.

రెండో విడతలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టుకు హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, కన్నడ, తెలుగు మాధ్యమాల్లో పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు.

అదేనెల 19న మొదటి విడత, రెండో విడతలో ఎస్జీటీ తెలుగు మాధ్యమం అభ్యర్థులకు పరీక్షలుంటాయని వివరించారు. ఆగస్టు ఐదో తేదీన మొదటి విడతలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు మాధ్యమంలో, రెండో విడతలో లాంగ్వేజ్ పండిట్ (హిందీ) అభ్యర్థులకు రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మెగా డీఎస్సీ ఆన్‌లైన్‌లో రాతపరీక్షల వివరాలు

పరీక్ష తేదీ	కేటగిరీ	మాధ్యమం
జులై 18న మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)	తెలుగు
	స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)	
రెండో విడత	పీఈటీ	హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, కన్నడ
జులై 19న మొదటి విడత	ఎస్జీటీ	తెలుగు
రెండో విడత	"	"
జులై 20న మొదటి విడత	ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)	ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు
రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)	తెలుగు, ఉర్దూ
జులై 22న మొదటి విడత	ఎస్జీటీ	తెలుగు
రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)	ఇంగ్లీష్,
హిందీ, కన్నడ		
		మరాఠీ, తెలుగు, ఉర్దూ
జులై 23న మొదటి విడత	ఎస్జీటీ	ఇంగ్లీష్, తెలుగు
రెండో విడత	"	తెలుగు
జులై 24న మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (బయలాజికల్ సైన్స్)	తెలుగు
జులై 25న మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)	--
రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ, తెలుగు,ఇంగ్లీష్, మరాఠీ)	
జులై 26న మొదటి విడత	లాంగ్వేజ్ పండిత్ (తెలుగు)	--
	ఎస్జీటీ	హిందీ, బెంగాలీ, కన్నడ తమిళం, ఉర్దూ, మరాఠీ
రెండో విడత	పీఈటీ	తెలుగు
జులై 30న మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (సోషల్)	హిందీ,
తెలుగు, ఉర్దూ, మరాఠీ		
రెండో విడత	"	ఇంగ్లీష్, తెలుగు
జులై 31న మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)	తెలుగు
		హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ,
మరాఠీ		
	స్కూల్ అసిస్టెంట్ (బయలాజికల్ సైన్స్)	తెలుగు
రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)	తెలుగు, ఉర్దూ
ఆగస్టు 1న మొదటి విడత	ఎస్జీటీ	ఇంగ్లీష్, తెలుగు
రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (సోషల్)	తెలుగు
ఆగస్టు 2న మొదటి విడత	లాంగ్వేజ్ పండిట్ (తెలుగు)	--
రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)	తెలుగు, ఉర్దూ
	స్కూల్ అసిస్టెంట్ (హిందీ, కన్నడ, మరాఠీ, సంస్కృతం, ఉర్దూ)	
ఆగస్టు 5న మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు
రెండో విడత	లాంగ్వేజ్ పండిట్ (హిందీ)	

సీపీఎస్‌ను రద్దు చేయండి

- ఆదాయపు పన్ను పరిమితిని పెంచండి
- కేంద్ర ఆర్థిక మంత్రికి టీఎన్జీవో, టీజీవో వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని టీఎన్జీవో, టీజీవో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఆదాయపు పన్ను పరిమితిని రూ.రెండున్నర లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచాలని కోరాయి. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి కె నిర్మలాసీతారామన్‌ను శుక్రవారం టీఎన్జీవో, టీజీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న పన్ను విధానంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు దాదాపుగా మూడు నెలల వేతనాన్ని ఆదాయపన్ను పరిధి కింద కోల్పోతున్నారని తెలిపారు. మెడికల్ ఖర్చులు, విద్య మీద పెట్టే ఖర్చులు పెరుగుతున్న సందర్భంగా అదనంగా రూ.ఏడున్నర లక్షలకు ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలని పేర్కొన్నారు. సేవింగ్ పరిమితిని రూ.ఒకటిన్నర లక్షల నుంచి రూ.నాలుగు లక్షలకు పెంచాలని కోరారు. హౌసింగ్ రుణాల మీద వడ్డీని రూ.4.50 లక్షలకు పెంచాలని సూచించారు. మెడికల్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి రూ.25 వేల పరిమితిని రూ.50 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ అంశాల పట్ల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీపీఎస్ రద్దు విషయంలో కేంద్రం పరిధిలో ఒక కమిటీని వేశామనీ, ఆ నివేదిక వచ్చిన తర్వాత అందులోని అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించి తప్పకుండా సీపీఎస్‌ను రద్దు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆదాయపన్ను పరిధి పరిమితి విషయంలో తప్పకుండా మోడీ ప్రభుత్వం వేతన జీవులను ఆదుకునే పద్ధతిలో అతి త్వరలో కొత్త విధానాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ విషయంలో ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం రాకుండా ఉండేటట్టు కేంద్ర ఆర్థిక శాఖ పక్షాన తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల ముత్యాల సత్యనారాయణగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, టీజీవో నాయకులు రామారావు, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ పీవీ ఘాట్ వద్ద నివాళి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి, బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని, దేశ ప్రధానిగా ఆయన సేవలు మరువలేనివని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 103వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పీవీ జ్ఞానభూమి, పీవీ ఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీవీ నూతన ఆర్థిక విధానాల రూపాశిల్పి అని, భూసంస్కరణలు, ఆర్థిక సంస్కరణలు తేవడంతో భారతదేశం ప్రపంచంలో ఆర్థిక శక్తిగా ఎదుగుతుందన్నారు.

ఫామ్ హౌస్‌కు పంపినా కేసీఆర్‌కు బుద్ధి రాలేదు

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి ఫామ్‌హౌస్‌కు పంపినా మాజీ సీఎం కేసీఆర్‌కు బుద్ధి రాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు.అధికారంపై ఆయన ఇంకా పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియాపాయింట్‌లో రామ్మోహన్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. సీఎం కుర్చీ నుంచి జనం లాగి పడేసినా కేసీఆర్ వాస్తవాన్ని గ్రహించడం లేదన్నారు. బాద్‌షా సినిమాలో బ్రహ్మానందం క్యారెక్టర్‌లా ఆయన తీరు ఉందన్నారు. ప్రజాపాలన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తావా? అని ప్రశ్నించారు. నిరుద్యోగుల సమస్యలంటూ కేటీఆర్ ఇంకా డ్రామాలాడుతున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం వల్లే సీతారామ ప్రాజెక్టు ఆలస్యం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం వల్లే సీతారామ ప్రాజెక్టు ఆలస్యమైందని సత్తుపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే మట్టా రాగమయి విమర్శించారు. ఆ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు వరప్రదాయని అన్నారు. 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు ట్రయల్ రన్ పట్ల రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. 2014 కు ముందే మూడు వేల కోట్ల అంచనాతో దుమ్ముగూడెం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిందనీ, కేసీఆర్ రీ డిజైన్ పేరుతో కాలయాపన చేశారని విమర్శించారు. రూ. 18,500 వేల కోట్లకు అంచనా వ్యయం పెంచారనీ, ప్రాజెక్టు పూర్తి చేయకుండా సగం తొవ్వి వదిలేశారని గుర్తు చేశారు. నిర్వాసితులకు పరిహారం కూడా ఇవ్వలేదని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది 1.2 లక్షల ఎకరాలకు నీళు ఇవ్వబోతున్నట్టు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో టన్నల్‌ను వచ్చే ఏడాది పూర్తి చేసి సాగు నీరు అందిస్తామన్నారు. జిల్లాకు అండగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ఆమె ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు.

జాతీయ ఉత్తమ టీచర్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

- రిజిస్ట్రేషన్‌కు తుది గడువు జులై 15

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ ఏడాదికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి కేంద్ర విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నదని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో వాటి సమర్పణకు వచ్చేనెల 15 వరకు గడువుందని పేర్కొన్నారు. దరఖాస్తులను http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆ వెబ్‌సైట్‌ను సంప్రదించి ఎంపిక మార్గదర్శకాలు, ఇతర వివరాలను తెలుసుకోవాలని కోరారు.

దీర్ఘకాలిక ఆర్థిక లోటుపై అమెరికాకు ఐఎమ్ఎఫ్ హెచ్చరిక



అమెరికా లోటు బడ్జెట్లు, చేస్తున్న విపరీతమైన అప్పులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెరుగుతున్న ప్రమాదాన్ని తెలియజేస్తున్నాయని, అవి తక్షణమే పరిష్కరించబడాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్-ఐఎమ్ఎఫ్) గురువారం హెచ్చరించింది. అమెరికా జాతీయ రుణం 35 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటోందని డేటా చూపిస్తుంది. తాజా గణాంకాల ప్రకారం, అమెరికా ఫెడరల్ బడ్జెట్ లోటు 2022 ఆర్థిక సంవత్సరంలో 1.4 ట్రిలియన్ నుంచి గత సంవత్సరం 1.7 ట్రిలియన్లకు పెరిగింది. ద్రవ్యలోటు ఈ సంవత్సరం 1.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉందని అమెరికాలోని అధికారిక ఆర్థిక పర్యవేక్షణ సంస్థ అయిన కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ ఈ నెల ప్రారంభంలో అంచనా వేసింది. ఇది స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)లో 7శాతానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇటువంటి అధిక లోటులు, అప్పులు అమెరికా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు పెరుగుతున్న ప్రమాదాన్ని, అధిక ఆర్థిక ఫైనాన్సింగ్ ఖర్చులకు, పరిపక్వ బాధ్యతలను సజావుగా జరగడానికి పెరుగుతున్న ప్రమాదాన్ని సూచిస్తాయి అని అమెరికా ఆర్థిక విధానాలపై జరిపిన సమీక్షలో ఐఎమ్ఎఫ్ పేర్కొంది. ఈ దీర్ఘకాలిక ఆర్థిక లోటులు నిరంతర విధానపరమైన లోపాలను సూచిస్తాయి. వీటిని అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది అని అది జోడించింది. జనవరి 2023లో చట్టబద్ధంగా 31.4 ట్రిలియన్ డాలర్లుగా నిర్ణయించబడిన రుణ పరిమితిని అమెరికా అతిక్రమించింది. అమెరికా ట్రెజరీ నుండి ఆసన్న దివాళా గురించి నెలల తరబడి హెచ్చరికల తర్వాత అధ్యక్షుడు జో బైడెన్ జూన్ 2023లో రుణ బిల్లుపై సంతకం చేశారు. అది జనవరి 2025 వరకు పరిమితిని నిలిపివేసింది. ఇది ప్రభావవంతంగా వచ్చే ఏడాది వరకు పరిమితులు లేకుండా రుణాలు తీసుకోవడాన్ని ప్రభుత్వం అనుమతించింది. బిల్లు ఆమోదం పొందిన రెండు వారాలలోపే రుణభారం 32 ట్రిలియన్లకు పెరిగింది. అప్పటినుండి పెరుగుతూనే ఉంది. అమెరికా దూకుడు వాణిజ్య విధానాల పెరుగుదలను ఐఎమ్ఎఫ్ తీవ్రంగా విమర్శించింది. చైనాతో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా వ్యాపార పరిమితుల విస్తరణ, 2023 బ్యాంక్ వైఫల్యాల ద్వారా వెల్లడైన దుర్బలత్వాలు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయని ఐఎమ్ఎఫ్ పేర్కొంది. అమెరికా అధిక వ్యయంపై తాజాగా ఐఎమ్ఎఫ్ ఈ హెచ్చరిక చేసింది. అమెరికా రుణం-స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) నిష్పత్తి రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యధికంగా ఉందని మంగళవారంనాడు ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఇసిడి)పేర్కొంది. డెట్(అప్పు)-టు-జీడీపీ నిష్పత్తి ని ఒక దేశం చేసిన అప్పులను తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఉపయోగిస్తారు.

ఓఇసిడి ప్రకారం గత సంవత్సరం అమెరికా రుణం దాని జీడీపీలో లో 122 శాతానికి పెరిగింది.

ప్రపంచ గమనం

బ్రిక్స్‌లో చేరేందుకు కాంగో ఆసక్తి



బ్రిక్స్‌లో సభ్యత్వం పొందేందుకు తమ దేశ ఆసక్తిని రిపబ్లిక్ ఆఫ్ కాంగో అధ్యక్షుడు డెనిస్ సస్సౌ న్గెస్సో వ్యక్తం చేశారు. ఆఫ్రికన్ నాయకుడు ఈ వారం రష్యా చేరుకున్నారు. అక్కడ అతను అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. ఆఫ్రికా దేశం బ్రిక్స్‌తో సంబంధాలను పెంపొందించుకోవడానికి ఆసక్తి చూపుతుందని గురువారంనాడు రష్యా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సస్సౌ న్గెస్సో నొక్కి చెప్పారు. 'బ్రిక్స్‌ను 2006లో బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనా స్థాపించాయి. దక్షిణాఫ్రికా 2011లో చేరింది. ప్రస్తుతం రష్యా బ్రిక్స్ చైర్మెన్‌గా ఉంది. ఈ సంవత్సరం ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పూర్తి సభ్యులుగా మారినప్పుడు బ్రిక్స్ విస్తరించింది' అని తెలిపారు.

సస్సౌ న్గెస్సో మంగళవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమైన సందర్భంగా ఆఫ్రికన్ నాయకుడికి రష్యన్ ఆర్డర్ ఆఫ్ ఆనర్ లభించింది. రష్యన్ ఫెడరేషన్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో మధ్య సంబంధాల అభివృద్ధి, పటిష్టతలకు ఆయన చేసిన గణనీయమైన కృషికి డెనిస్ సాసౌ న్గెస్సో ఈ అవార్డును అందుకున్నారు.

ఈ సమావేశంలో, రష్యా-కాంగోల సంబంధాల అభివృద్ధికి సాసో న్గెస్సో గణనీయమైన వ్యక్తిగత సహకారం అందించాడని పుతిన్ మెచ్చుకున్నారు. సాసో న్గెస్సో రెండు రష్యా-ఆఫ్రికా శిఖరాగ్ర సమావేశాలలో పాల్గొన్నారు. మేము అన్ని రంగాలలో మా సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాము అని పుతిన్ చెప్పారు. రష్యా, రిపబ్లిక్ ఆఫ్ కాంగో దౌత్య సంబంధాల 60వ వార్షికోత్సవాన్ని ఈ సంవత్సరం జరుపుకుంటున్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని కాంగో గౌరవ కాన్సుల్ జోసెలిన్-పాట్రిక్ మాండ్‌జెలా ప్రకారం, సాసౌ న్గెస్సో ఉత్తర రష్యన్ నగరాన్ని కూడా సందర్శిస్తారు. అక్కడ స్థానిక గవర్నర్‌తో సమావేశమవటంతోపాటు అనేక కార్యక్రమాలలో పాల్గొంటారు. జూన్ ప్రారంభంలో, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ కాంగోకు అధికారిక పర్యటన చేశారు. అక్కడ ఆయన దేశ నాయకత్వంతో చర్చలు జరిపారు. వాణిజ్యం, ఆర్థిక సంబంధాలను పెంపొందించడం, ఇంధన రంగ ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం, సైనిక-సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయడంవంటి విషయాలపై లావ్రోవ్ చర్చించాడు.